
E-KABURU E-PAPER
# ఈ-కబురు
ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం
@ekaburu.com
(తేదీ) 10-08-2025 (వారం) ఆదివారం హైదరాబాద్ పేజీలు–6 e-kaburu.com


హైదరాబాద్‌లో భారీ వర్షం » 3లో

## ఓఆర్ఆర్‌పై 'గేట్ వే ఆఫ్ హైదరాబాద్'

» గాంధీ సరోవర్ వద్ద ప్రపంచంలోనే ఎత్తయిన టవర్ నిర్మాణం
» బహుళ ప్రయోజనకారిగా మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు
» ఆధునిక ఆర్థిక కేంద్రంగా హైదరాబాద్ నగరాభివృద్ధికి ప్రణాళికలు
» 2 నెలల్లో టెండర్లు పిలవాలని అధికారులకు సీఎం రేవంత్ ఆదేశం



హైదరాబాద్,ఈ కబురు :కోర్ అర్బన్ సిటీని ప్రపంచస్థాయి ఆధునిక ఆర్థిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. నగరంలో మరో ఆర్థిక చక్రాన్ని సృష్టించేలా మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు చేపట్టనుంది. ప్రపంచస్థాయి గుర్తింపు తీసుకొచ్చేలా నగరానికి 'గేట్ వే ఆఫ్ హైదరాబాద్' పేరిట ముఖద్వారం నిర్మించనుంది. తొలిదశలో హిమాయత్‌సాగర్ నుంచి బాపూఘాట్ (గాంధీ సరోవర్) వరకు 9 కి.మీ. మేర అభివృద్ధి చేయనుంది.

తరువాయి 2లో

## సంతకమైనా చేయండి.. క్షమాపణైనా చెప్పండి

» మరోసారి రాహుల్‌ను కోరిన ఈసీ

ఈ కబురు,ఢిల్లీ: ఓట్ల చోరీపై ఓవైపు కాంగ్రెస్ నేతలు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తుతున్న వేళ.. ఎన్నికల సంఘం(ఈసీ) మరోసారి డిక్లరేషన్ సమర్పించాలని రాహుల్ గాంధీని కోరింది. "నిబంధనల ప్రకారం తన వ్యాఖ్యలు వాస్తవమని పేర్కొంటూ రాహుల్ సంతకం చేసి డిక్లరేషన్ సమర్పించాలి. లేదా తాను చేసిన తప్పుడు ఆరోపణలకు



తరువాయి 2లో

## ప్రధాని మోదీకి రాఖీ కట్టిన చిన్నారులు



» రక్షా బంధన్ సందర్భంగా విద్యార్థులు, బ్రహ్మకుమారీలు మోదీకి రాఖీలు కట్టారు. ఓ చిన్నారి ఇలా ప్రధానికి ముద్దు పెట్టింది.

ఈ కబురు,ఢిల్లీ: ప్రధాని అధికారిక నివాసంలో రక్షా బంధన్ సందర్భంగా విద్యార్థులు, ఆధ్యాత్మిక సంస్థ బ్రహ్మకుమారి సభ్యులు ప్రధాని మోదీకి శనివారం రాఖీలు కట్టారు. ఈ సందర్భంగా దేశ ప్రజలకు మోదీ శుభాకాంక్షలు తెలియజేశారు. "సోదర సోదరీమణుల మధ్య అపరిమిత ప్రేమకు ప్రతీక ఈ రక్షా బంధన్.

తరువాయి 2లో


భారతీ ఎయిర్‌టెల్ బల్క్ డీల్.. రూ. 11,227 కోట్ల షేర్ల విక్రయం » 4లో



కేఎల్‌ను కనీసం ప్రశంసించలేరా? ఎల్ఎస్‌జీపై ఫ్యాన్స్ ఫైర్! » 6లో



10వేల క్రిస్టల్స్, ఐవరీ వైట్ లెహంగాలో జాన్వీ డాజ్లింగ్ లుక్ » 5లో



టీమిండియా ఘోర ఓటమి.. 73 పరుగులకే ఆలౌట్ » 6లో



## పంచాయతీ సచివాలయం దాకా సౌర విద్యుత్ ప్లాంట్లు



» పెద్దఎత్తున సోలార్ పవర్ ఉత్పత్తికి చర్యలు
» వేగిరంగా 'ఇందిర సౌర గిరిజల వికాసం'
» కలెక్టర్లకు డిప్యూటీ సీఎం భట్టి ఆదేశం

» 2లో

## ప్రత్యేక బస్సుల్లో రేపటి దాకా అదనపు చార్జీలు

» రాఖీ పండుగ సందర్భంగా వేసిన ప్రత్యేక బస్సుల్లో పెంచిన టికెట్ ధరలు సోమవారం వరకు
» ప్రత్యేక బస్సుల్లో రేపటి దాకా అదనపు చార్జీలు
» రెగ్యులర్ బస్సుల్లో సాధారణ చార్జీలే: ఆర్టీసీ




తరువాయి2లో

## 'సిందూర్'లో ఆరు పాక్ విమానాలు కూల్చాం

» ఎయిర్ చీఫ్ మార్షల్ వెల్లడి



బెంగళూరు(మారతహళ్లి),ఈ కబురు: సిందూర్‌లో భాగంగా భారతీయ వాయుసేన పాకిస్థాన్‌కు చెందిన ఐదు యుద్ధ విమానాలను, మరో పెద్ద విమానాన్ని నేలకూల్చిందని ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్ శనివారం

తరువాయి2లో

## 15న ట్రంప్, పుతిన్ భేటీ!



ఈ కబురు,వాషింగ్టన్: రష్యా, ఉక్రెయిన్ యుద్ధం ముగింపు దిశగా తీవ్ర ప్రయత్నాలు జరుగుతున్నాయి. అందులో భాగంగా ఈ నెల 15వ తేదీన అమెరికాలోని అలాస్కాలో దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌ల భేటీ జరగనుంది. ఈ విషయాన్ని స్వయంగా తన సోషల్ మీడియా వేదిక 'ట్రూత్ సోషల్' ద్వారా ట్రంప్ వెల్లడించారు. అయితే రష్యా నుంచి ఇంకా ఎటువంటి అధికారిక స్పందన రాలేదు. కానీ త్వరలో ఈ భేటీ ఉంటుందని ఇటీవలే ఆ దేశం వెల్లడించింది. పుతిన్‌తో సమావేశంలో యుద్ధాన్ని ముగించడంపై చర్చలు జరపనున్నామని ట్రంప్ తెలిపారు. శాంతి ఒప్పందంలో భాగంగా భూభాగాల మార్పిడి ఉంటుందని ఆయన వెల్లడించారు. అయితే దీనికి అంగీకరించేది లేదని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ స్పష్టం చేశారు.

తరువాయి 3లో

## రూ.80 వేల కోట్ల పెట్టుబడులకు సిద్ధం



» 3లో

## కేటీఆర్‌కు రాఖీ కట్టని కవిత.. పండగ వేళ ఎందుకీ ఎడబాటు?



» 3లో

## అటు బనకచర్ల.. ఇటు ఎమ్మెల్సీలు



» సుప్రీంకోర్టును ఆశ్రయించేందుకు బీఆర్ఎస్ సన్నాహాలు
» ఎమ్మెల్సీల అనర్హతపై సోమవారం కేటీఆర్ పిటిషన్ దాఖలు
» బనకచర్లపై సుప్రీం న్యాయవాదులతో హరీశ్ మంతనాలు

ఈ కబురు, హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలపై నిరంతరం విమర్శల వర్షం కురిపిస్తున్న బీఆర్ఎస్ పార్టీ.. తెలంగాణకు సంబంధించిన కీలక అంశాలపై న్యాయ పోరాటం చేయాలని భావిస్తోంది. పార్టీ మారిన ఎమ్మెల్సీలను అనర్హులుగా ప్రకటించాలని సుప్రీంకోర్టును ఆశ్రయించాలని నిర్ణయించిన బీఆర్ఎస్ 'గోదావరి బనకచర్ల'లింకు ప్రాజెక్టుపైనా దేశ అత్యున్నత న్యాయస్థానానికి వెళ్లేందుకు సన్నద్ధమవుతోంది. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన పదిమంది ఎమ్మెల్యేలపై మూడు నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలని స్పీకర్‌ను సుప్రీంకోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే. అదే తరహాలో ఫిరాయింపు ఎమ్మెల్సీలపైనా కోర్టుకు వెళ్లాలని బీఆర్ఎస్ నిర్ణయించింది.

తరువాయి 3లో

## రక్షాబంధన్... ట్రాఫిక్ చక్రబంధం



» వరుస సెలవులతో సొంతూళ్లకు జనం
» హైదరాబాద్‌లో భారీగా నిలిచిన వాహనాలు
» రాష్ట్రవ్యాప్తంగా కిక్కిరిసిన ఆర్టీసీ బస్సులు
» 'ప్రత్యేక' పేరుతో 50 శాతం వరకు అదనపు ఛార్జీలు

ఈ కబురు, హైదరాబాద్: వరుస సెలవులు, రాఖీ పౌర్ణమి నేపథ్యంలో సొంతూళ్లకు బయలుదేరిన జనంతో రహదారులన్నీ కిక్కిరిసిపోయాయి. రాజధానితో పాటు జిల్లా కేంద్రాల్లో శనివారం తీవ్ర ట్రాఫిక్ జామ్‌లతో ప్రజలు ఇబ్బందులుపడ్డారు. హైదరాబాద్ మహానగరం ట్రాఫిక్ చక్రబంధంలో చిక్కుకుంది. రెండ్రోజులుగా కురుస్తున్న వర్షంతో నగరంలోని రోడ్లన్నీ గుంతలమయంగా మారి... ప్రయాణం నరకాన్ని తలపించింది. గచ్చిబౌలి నుంచి మెహిదీపట్నం వైపు వచ్చే మార్గంలో షేక్‌పేట్ పైవంతెన వద్ద వాహనాలు నెమ్మదిగా ముందుకుసాగాయి.

తరువాయి3లో

ఈ-కబురు

10- 08 -2025
ఆదివారం
e-kaburu.com

మొదటి పేజీ తరువాయి

# ఓఆర్ఆర్‌పై 'గేట్ వే ఆఫ్ హైదరాబాద్'



శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి ఔటర్ రింగు రోడ్డు పైకి వెళ్లే మార్గం వద్ద గేట్ వేను నిర్మించనుంది. కిస్మత్‌పుర నుంచి బాపూఘాట్ వరకు మూసీ నదీ తీరాన్ని అభివృద్ధి చేస్తారు. ఈ మార్గంలో కన్వెన్షన్ సెంటర్లు ఇతరత్రా ప్రాజెక్టులు నెలకొల్పుతారు. దీంతోపాటు గాంధీ సరోవర్ వద్ద ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన 'ఐకానిక్ టవర్' నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రాజెక్టు ప్రణాళికలను వెంటనే పూర్తి చేసి, రెండు నెలల్లో టెండర్లు పిలవాలని పురపాలక అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టును బహుళ ప్రయోజనాలతో చేపట్టనున్నట్లు సీఎంవో శనివారం ఓ ప్రకటనలో తెలిపింది. ఓ వైపు ఎకోథీమ్ పార్కు.. మరోవైపు ఐకానిక్ టవర్.. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులకు స్వాగతం పలికేలా గేట్ వే ఆఫ్ హైదరాబాద్‌ను ప్రభుత్వం నిర్మించనుంది. హైదరాబాద్‌తో పాటు తెలంగాణకు ఆర్థికశక్తి ఇచ్చేలా మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టులో వివిధ అంశాలు చేర్చుతోంది. ఓఆర్ఆర్‌కు ఒకవైపు ఎకోథీమ్ పార్కు అభివృద్ధి, మరోవైపు బాపూఘాట్ సమీపంలో భారీ ఐకానిక్ టవర్ నిర్మాణానికి ప్రణాళికలు రచిస్తోంది. వీటి డిజైన్లు సిద్ధం చేస్తోంది. గాంధీ సరోవర్ సమీపంలోని ఎకోథీమ్ పార్కు, ఐకానిక్ టవర్లకు చేరుకునేలా ప్రయాణాల కోసం ఎలివేటెడ్ కారిడార్ నిర్మించాలని సీఎం ఇప్పటికే అధికారులకు సూచించారు. బాపూఘాట్ చుట్టూ ఉన్న ప్రాంతాన్ని ప్రపంచస్థాయి జోన్‌గా అందరినీ ఆకట్టుకునేలా తీర్చిదిద్దేందుకు ప్రణాళిక రూపొందించాలని నిర్దేశించారు.

**కొత్తగా పైవంతెన...**

హిమాయత్‌సాగర్ దగ్గర అప్రోచ్ రోడ్డు నుంచి అత్తాపూర్ వైపు వెళ్లేందుకు కొత్తగా పైవంతెన నిర్మించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోంది. గాంధీ సరోవర్ చుట్టూ ఈ పైవంతెనతో కనెక్టివిటీ కల్పించనుంది. ఎయిర్‌పోర్టు నుంచి నేరుగా అక్కడికి చేరుకునేలా మరో ప్రణాళికనూ అధికారులు పరిశీలిస్తున్నారు. గాంధీ సరోవర్ వద్ద అక్కడి భూమి, ఇతర పరిస్థితులకు అనుగుణంగా ఐకానిక్ టవర్‌ని ఎంత ఎత్తుతో నిర్మించాలన్న విషయమై అంచనాకు రానున్నారు.

**భూగర్భ తాగునీటి సంపులు...**

తాగునీటితో పాటు వరదనీటి నిర్వహణకు వీలుగా మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు డిజైన్లపై సమాలోచనలు జరుగుతున్నాయి. వివిధ దేశాల్లోని నదీతీర అభివృద్ధి ప్రాజెక్టు నమూనాలను పరిశీలిస్తున్నారు. హైదరాబాద్ నగర తాగునీటి అవసరాలు తీర్చేలా ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ జలాల్ని మరింత సమర్థంగా వినియోగించుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టులో స్థలం వృథా లేకుండా పరీవాహక ప్రాంతానికి ఇరువైపులా భూగర్భంలో భారీ సామర్థ్యంతో కూడిన తాగునీటి స్టోరేజీ సంపులు నిర్మించాలని యోచిస్తోంది. అక్కడ తాగునీటిని నిల్వ చేసి, అవసరాల మేరకు సరఫరా చేయనుంది. గాంధీ సరోవర్‌ను అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేసేందుకు అక్కడ ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే నీటి నిర్వహణపై పక్కాగా అధ్యయనం చేస్తోంది.

**రాత్రివేళా వ్యాపార కార్యకలాపాలు: సీఎం**

''హైదరాబాద్ నగరంలో ఉదయం నుంచి రాత్రి వరకు ఆర్థిక కార్యకలాపాలు కొనసాగుతాయి. రాత్రి 7 నుంచి ఉదయం 7 గంటల వరకూ ఈ కార్యకలాపాలను విస్తరించేందుకు మూసీ పునరుజ్జీవ అభివృద్ధి ప్రాజెక్టు పనిచేస్తుంది. ఇది సుందరీకరణ కాదు. తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు మరో ఆర్థిక చక్రం. ఇందులో ఎలివేటెడ్ కారిడార్లు, ఐటీ కంపెనీలు, హోటళ్లు, పరిశ్రమలు, పర్యాటకం, డౌన్‌టౌన్ ఉంటాయి. మన దేశంలో పాత నగరాల్ని విడిచిపెట్టి కొత్త నగరాలు, ఇతర ప్రాంతాలకు తరలివెళ్తున్నారు. హైదరాబాద్‌లో పాతబస్తీయే అసలైన నగరం. దానికి పునరుజ్జీవం తీసుకొస్తాను. రానున్న 50 ఏళ్లను దృష్టిలో పెట్టుకుని నదికి ఇరువైపులా ఆర్థిక వ్యవస్థను సిద్ధం చేసేందుకు ప్రయత్నిస్తున్నాం.'

మొదటి పేజీ తరువాయి

# పంచాయతీ సచివాలయం దాకా సౌర విద్యుత్ ప్లాంట్లు



హైదరాబాద్, ఈ కబురు: రాష్ట్ర ప్రభుత్వం సౌర విద్యుత్తును ప్రోత్సహించేందుకు చర్యలు ముమ్మరం చేసింది. గ్రామపంచాయతీ నుంచి సచివాలయం వరకూ అన్ని ప్రభుత్వ భవనాల మిద్దెలపై సోలార్ రూఫ్‌టాప్ ప్లాంట్ల ఏర్పాటుతో పెద్ద ఎత్తున సౌర విద్యుత్తు ఉత్పత్తికి చర్యలు తీసుకోవాలని అధికారులను డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. అలాగే ఇందిరా సౌర గిరిజల వికాసం పథకం అమలును వేగిరం చేయాలన్నారు. అటవీ హక్కుల రక్షణ చట్టం (ఆర్ఓఎఫ్ఆర్) కింద రైతులు పట్టాలు పొందిన భూముల వివరాలను పంపాలని ఏజెన్సీ ప్రాంత అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ భవనాలపై సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటు, ఆర్ఓఎఫ్ఆర్ భూముల్లో ఇందిరా సౌర గిరిజన వికాసం అమలుపై జిల్లా కలెక్టర్లతో గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఇంధన శాఖ ముఖ్యకార్యదర్శి నవీన్ మిట్టల్, ఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ ఫారూఖీతో కలిసి సమీక్షించారు. ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలలు, ఉన్నత విద్యాసంస్థల భవనాలపైనా సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు అవసరమైన వివరాలనూ పంపాలని కలెక్టర్లను మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. పార్కింగ్, క్యాంటిన్లతోపాటు కలెక్టరేట్ కార్యాలయాల ప్లాన్లను హైదరాబాద్‌కు పంపాలని సూచించారు. కలెక్టరేట్లన్నీ ఒకే నమూనాలో నిర్మించినందున సౌర విద్యుత్ ప్లాంట్ డిజైన్ కూడా హైదరాబాద్ నుంచే పంపుతామన్నారు. సౌర విద్యుత్తు ప్లాంట్ల ఏర్పాటుకు అవసరమైన వివరాలను వారం లోపు ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి కార్యాలయంలో సమర్పించాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. నీటి పారుదల, రోడ్లు భవనాల శాఖల పరిధిలో పెద్ద ఎత్తున ఖాళీగా ఉన్న స్థలాల వివరాలనూ అందించాలని చెప్పారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఆర్ఓఎఫ్ఆర్ చట్టం కింద పట్టాలు పంపిణీ చేసిన 6.70 లక్షల ఎకరాల భూముల్లో 'నల్లమల డిక్లరేషన్' అమలు చేస్తున్నామన్న మల్లు భట్టి విక్రమార్క.. ఆ భూముల్లో కింద ఇందిరా సౌర గిరిజల వికాసం పథకం ద్వారా ఉచిత సోలార్ పంపు సెట్లు ఏర్పాటు చేయనున్నట్టు కలెక్టర్లకు వివరించారు. అచ్చంపేటలో ప్రారంభమైన నల్లమల డిక్లరేషన్.. త్వరలోనే ఆదిలాబాద్ జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో ప్రారంభించేందుకు ఆలోచిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరా సౌర గిరిజల వికాసం పథకం అమలుకు అవసరమైన వివరాలను అలసత్వం లేకుండా వారం లోపు అందజేయాలని ఆయన చెప్పారు. ఈ విషయంలో సందేహాలుంటే ఇంధనశాఖ ముఖ్యకార్యదర్శి, ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్ సీఎండీలు, రెడ్‌కో వీసీఎండీని సంప్రదించాలని డిప్యూటీ సీఎం కలెక్టర్లను ఆదేశించారు.

# ప్రత్యేక బస్సుల్లో రేపటి దాకా అదనపు చార్జీలు



హైదరాబాద్, ఈ కబురు: రాఖీ పండుగ సందర్భంగా వేసిన ప్రత్యేక బస్సుల్లో పెంచిన టికెట్ ధరలు సోమవారం వరకు (ఆగస్టు 11) అమల్లో ఉంటాయని ఆర్టీసీ యాజమాన్యం ప్రకటించింది. రాష్ట్ర ప్రభుత్వ జీవో ప్రకారమే ప్రత్యేక బస్సులకు చార్జీలు పెంచినట్లు అధికారులు తెలిపారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా ప్రయాణికులకు అసౌకర్యం కలుగకుండా ఉండేందుకే ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశామని చెప్పారు. ప్రత్యేక బస్సులు మినహా రెగ్యులర్ బస్సుల్లో సాధారణ చార్జీలే అమల్లో ఉంటాయని పేర్కొన్నారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా ఆర్టీసీ సిబ్బంది అద్భుతంగా పని చేస్తున్నారని మంత్రి పొన్నం ప్రశంసించారు. సోదరభావానికి ప్రతీక అయిన రాఖీ పండుగను త్యాగం చేసి.. నిబద్ధత, అంకితభావం, క్రమశిక్షణతో సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని కొనియాడారు. గత రాఖీ పండుగ సందర్భంగా ఒక్కరోజే 63 లక్షల మంది, మూడు రోజుల్లో రికార్డు స్థాయిలో 1.77 కోట్ల మంది ఆర్టీసీ బస్సుల్లో రాకపోకలు సాగించారని చెప్పారు.

మొదటి పేజీ తరువాయి

# 'సిందూర్'లో ఆరు పాక్ విమానాలు కూల్చాం



బెంగళూరు(మారతహళ్లి),ఈ కబురు: సిందూర్‌లో భాగంగా భారతీయ వాయుసేన పాకిస్థాన్‌కు చెందిన ఐదు యుద్ధ విమానాలను, మరో పెద్ద విమానాన్ని నేలకూల్చిందని ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్ శనివారం ప్రకటించారు. ఇది గగనతల యుద్ధంలో భారత్ ఇప్పటివరకూ సాధించిన అతిపెద్ద విజయమని ఆయన పేర్కొన్నారు. మూడు నెలల క్రితం జరిగిన ఆపరేషన్ సిందూర్‌లో పాక్ విమానాలు కూలగొట్టిన విషయాన్ని బహిర్గతం చేయడం ఇదే మొదటిసారి. 16వ ఎయిర్ చీఫ్ మార్షల్ ఎల్.ఎం.కత్రే స్మారకోపన్యాస కార్యక్రమంలో ప్రసంగిస్తూ అమర్ ప్రీత్ సింగ్ పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా చేపట్టిన ఆపరేషన్‌లో సాధించిన విజయాలు వివరించారు. పాక్‌లోని ఉగ్రవాద స్థావరాలను ఏవిధంగా ధ్వంసం చేసిందీ తెలిపారు.

జాతీయ భద్రతలో వైమానిక శక్తి ప్రాముఖ్యత మరింత పెరిగిందని పేర్కొన్నారు. భారత వాయుసేన, హెచ్ఏఎల్, డీఆర్‌డీఓలకు గత ఎయిర్ చీఫ్ మార్షల్ కత్రె చూపించిన మార్గదర్శనం నేడు చక్కని ఫలితాలను అందిస్తోందని తెలిపారు. దేశీయంగా రక్షణ పరికరాల తయారీ, పరిశోధన, అభివృద్ధిలో ప్రైవేటు సంస్థల భాగస్వామ్యం సాధికారతకు బాటలు వేస్తోందని అన్నారు. విశ్రాంత అధికారులు ఏకే పాత్ర, హెచ్‌బీ రాజారామ్, హెచ్ఏఎల్, డీఆర్‌డీఓ అధికారులు ఈ సదస్సులో పాల్గొన్నారు.

**భారత్ ఒక్క విమానాన్నీ కూల్చలేదు**

ఇస్లామాబాద్: భారత వాయుసేన ఆపరేషన్ సిందూర్ సందర్భంగా పాకిస్థాన్‌కు చెందిన యుద్ధ విమానాలను కూల్చిందన్న ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్ వాదనలో నిజం లేదని పాకిస్థాన్ ప్రకటించింది. నాటి సంఘర్షణలో పాకిస్థాన్ ఒక్క విమానాన్నీ కోల్పోలేదని ఆ దేశ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ ఇస్లామాబాద్‌లో విలేకరులతో చెప్పారు. మూడు నెలలుగా విమానాల కూల్చివేత విషయాన్ని వెల్లడించలేదని ఎత్తిచూపుతూ.. సమయం మీరిన తర్వాత భారత ఎయిర్ చీఫ్ మార్షల్ చేసిన ప్రకటన నమ్మశక్యంగా లేదని ఆయన అన్నారు.

మొదటి పేజీ తరువాయి

# ప్రధాని మోదీకి రాఖీ కట్టిన చిన్నారులు

ఈ కబురు,ఢిల్లీ: ప్రధాని అధికారిక నివాసంలో రక్షా బంధన్ సందర్భంగా విద్యార్థులు, ఆధ్యాత్మిక సంస్థ బ్రహ్మకుమారి సభ్యులు ప్రధాని మోదీకి శనివారం రాఖీలు కట్టారు. ఈ సందర్భంగా దేశ ప్రజలకు మోదీ శుభాకాంక్షలు తెలియజేశారు. "సోదర సోదరీమణుల మధ్య అపరిమిత ప్రేమకు ప్రతీక ఈ రక్షా బంధన్. ఈ పండుగ మీ బంధాలను మరింత తీపికరంగా చేయాలని, ఆప్యాయత, సామరస్య భావాలను బలోపేతం చేయాలని, ప్రజలంతా ఆనందంగా ఉండాలని ఆకాంక్షిస్తున్నా" అంటూ మోదీ 'ఎక్స్'లో పోస్టు చేశారు. సంస్కృతాన్ని ప్రాచుర్యంలోకి తేవడానికి తమ ప్రభుత్వం గత దశాబ్దంలో ఎన్నో ప్రయత్నాలు చేసిందని శనివారం ప్రధాని మోదీ ప్రపంచ సంస్కృత దినోత్సవం సందర్భంగా అన్నారు. "ప్రతి రంగంలోనూ సంస్కృత భాష ప్రతిబింబిస్తోంది. దీని ఉన్నతికి కృషి చేస్తున్న ప్రతి ఒక్కరికీ అభినందనలు" అని ప్రధాని పేర్కొన్నారు. క్విట్ ఇండియా ఉద్యమానికి 83 ఏళ్లు నిండిన నేపథ్యంలో ఇందులో పాల్గొన్నవారికి ప్రధాని మోదీ నివాళులర్పించారు. "బాపు స్ఫూర్తిదాయక నాయకత్వంలో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్న వారందరినీ మేం కృతజ్ఞతతో గుర్తుంచుకుంటాం. వారి పోరాటం దేశభక్తి జ్వాలను రగిలించింది. దేశాన్ని ఏకం చేసింది" అని మోదీ 'ఎక్స్'లో రాసుకొచ్చారు. క్విట్ ఇండియా ఉద్యమకారులకు కాంగ్రెస్ కూడా నివాళులర్పించింది. ఉద్యమ సమయంలో కాంగ్రెస్ అగ్ర నాయకులంతా జైళ్లలో ఉంటే ఆరెస్సెస్ మాత్రం క్విట్ ఇండియా ఉద్యమాన్ని వ్యతిరేకించిందని ఆ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శించారు.







# సంతకమైనా చేయండి.. క్షమాపణైనా చెప్పండి

ఈ కబురు,ఢిల్లీ: ఓట్ల చోరీపై ఓవైపు కాంగ్రెస్ నేతలు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తుతున్న వేళ.. ఎన్నికల సంఘం(ఈసీ) మరోసారి డిక్లరేషన్ సమర్పించాలని రాహుల్ గాంధీని కోరింది. ''నిబంధనల ప్రకారం తన వ్యాఖ్యలు వాస్తవమని పేర్కొంటూ రాహుల్ సంతకం చేసి డిక్లరేషన్ సమర్పించాలి. లేదా తాను చేసిన తప్పుడు ఆరోపణలకు క్షమాపణైనా చెప్పాలి'' అని ఎన్నికల సంఘంలోని ఓ అధికారి పేర్కొన్నారు. గతేడాది జరిగిన లోక్‌సభ, శాసనసభ ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని రాహుల్ ఆరోపించిన తర్వాత కర్ణాటక, మహారాష్ట్ర, హరియాణాకు చెందిన ప్రధాన ఎన్నికల కమిషనర్లు.. ఓటర్ల జాబితాల నుంచి తీసివేసిన లేదా మోసపూరితంగా చేర్చిన పేర్ల వివరాలతో పాటు సంతకం చేసిన ఓ డిక్లరేషన్‌ను సమర్పించాలని కాంగ్రెస్ నేతను కోరాయి. పార్లమెంటు సభ్యుడిగా రాజ్యాంగాన్ని కాపాడతానని తానిప్పటికే ప్రమాణం చేశాను కాబట్టి ఎలాంటి డిక్లరేషన్ సమర్పించనని రాహుల్ తెలిపారు. ఈ నేపథ్యంలో మరోసారి ఈసీ.. రాహుల్‌ను డిక్లరేషన్ కోరడం గమనార్హం.

**నమ్మకం లేకుంటే రాజీనామా చేయండి: భాజపా**

ఎన్నికల సంఘం(ఈసీ)పై నమ్మకం లేకుంటే తన ఎంపీ పదవికి రాజీనామా చేయాలని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీని భాజపా డిమాండ్ చేసింది. ఓట్ల చౌర్యంపై ఆయన చేసిన ఆరోపణలను ఈసీకి లిఖిత పూర్వకంగా ఇవ్వకపోవడంపై తీవ్రంగా దుయ్యబట్టింది.

**ఓట్ల దొంగతనంపై ఈసీ దర్యాప్తు చేపట్టాలి: పవార్**

ఓట్ల దొంగతనం ఆరోపణలపై ఈసీ దర్యాప్తు చేపట్టాలని ఎన్సీపీ (ఎస్పీ) అధ్యక్షుడు శరద్ పవార్ డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీ సరైన ఆధారాలతోనే ప్రశ్నిస్తున్నారని అన్నారు. ఈ విషయాన్ని పరిశీలించి దర్యాప్తు చేయాల్సిన బాధ్యత ఈసీపై ఉందన్నారు.



# రూ.80 వేల కోట్ల పెట్టుబడులకు సిద్ధం



ఈ కబురు, హైదరాబాద్: తెలంగాణలో పునరుద్ధరణీయ ఇంధన ఉత్పత్తి రంగంలో భారీగా పెట్టుబడులు పెట్టడానికి తాము సిద్ధంగా ఉన్నామని ఎన్టీపీసీ సీఎండీ గుర్దీప్ సింగ్ సీఎం రేవంత్‌రెడ్డికి తెలిపారు. హైదరాబాద్‌లోని సీఎం నివాసంలో ఆయనను గుర్దీప్ సింగ్ బృందం శనివారం కలిసింది. ఈ సందర్భంగా రాష్ట్ర విద్యుత్ రంగంలో పెట్టుబడుల గురించి చర్చించారు. సౌర, పవన విద్యుత్ ప్రాజెక్టుల్లో సుమారు రూ.80 వేల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు గుర్దీప్ సింగ్ తెలిపారు. ఫ్లోటింగ్ సోలార్ విద్యుదుత్పత్తికి సంబంధించి రాష్ట్రంలో 6,700 మెగావాట్ల సామర్థ్యానికి అవకాశం ఉందన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఎన్టీపీసీకి అన్ని రకాలుగా సహకరించేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు.

# ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనుల పునరుద్ధరణకు రూట్‌మ్యాప్



ఈ కబురు, హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలపై నిరంతరం విమర్శల వర్షం కురిపిస్తున్న బీఆర్ఎస్ పార్టీ.. తెలంగాణకు సంబంధించిన కీలక అంశాలపై న్యాయ పోరాటం చేయాలని భావిస్తోంది. పార్టీ మారిన ఎమ్మెల్సీలను అనర్హులుగా ప్రకటించాలని సుప్రీంకోర్టును ఆశ్రయించాలని నిర్ణయించిన బీఆర్ఎస్ 'గోదావరి బనకచర్ల'లింకు ప్రాజెక్టుపైనా దేశ అత్యున్నత న్యాయస్థానానికి వెళ్లేందుకు సన్నద్ధమవుతోంది. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన పదిమంది ఎమ్మెల్యేలపై మూడు నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలని స్పీకర్‌ను సుప్రీంకోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే. అదే తరహాలో ఫిరాయింపు ఎమ్మెల్సీలపైనా కోర్టుకు వెళ్లాలని బీఆర్ఎస్ నిర్ణయించింది.

ఢిల్లీకి చేరుకున్న వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

ఫిరాయింపు ఎమ్మెల్సీలను అనర్హులుగా ప్రకటించాలని కోరుతూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సోమవారం సుప్రీంకోర్టులో స్వయంగా పిటిషన్ దాఖలు చేయనున్నారు. శుక్రవారం సాయంత్రం ఢిల్లీకి చేరుకున్న కేటీఆర్ న్యాయ నిపుణులతో సంప్రదింపులు జరుపుతున్నట్టు బీఆర్ఎస్ వర్గాలు వెల్లడించాయి. కేటీఆర్‌తోపాటు ఢిల్లీకి వెళ్లిన బీఆర్ఎస్ లీగల్ సెల్ న్యాయవాదులు పిటిషన్ దాఖలుకు అవసరమైన పత్రాలు సిద్ధం చేస్తున్నారు.

బనకచర్లపై బీఆర్ఎస్ న్యాయపోరాటం

ఏపీ ప్రభుత్వం చేపడుతున్న గోదావరి బనకచర్ల లింకు ప్రాజెక్టును వ్యతిరేకిస్తున్న బీఆర్ఎస్.. ఈ ప్రతిపాదనకు ఆదిలోనే అడ్డు చెప్పాలని భావిస్తోంది. బనకచర్ల లింకు ప్రాజెక్టును అడ్డుకొని తీరుతామని ప్రకటించిన బీఆర్ఎస్ అందుకు అవసరమైన కార్యాచరణపైనా దృష్టి పెట్టిన విషయం తెలిసిందే. బనకచర్ల ద్వారా తెలంగాణకు జరిగే అన్యాయంపై ఇప్పటికే పార్టీ కేడర్‌కు, విద్యార్థి, యువజన విభాగం నాయకులకు బీఆర్ఎస్ అవగాహన కల్పించింది. ఇందులో భాగంగా హైదరాబాద్, మంచిర్యాలలో విద్యార్థి సదస్సులు కూడా నిర్వహించింది. ఓ వైపు క్షేత్ర స్థాయిలో బనకచర్లను అడ్డుకుంటూనే మరోవైపు న్యాయ పోరాటానికి సిద్ధమవుతోంది.

బనకచర్లపై సుప్రీంకు వెళ్లే యోచన!

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు బనకచర్ల లింకు ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వకుండా కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ వేసేందుకు ఆ పార్టీ సన్నద్ధమవుతోంది. నీటిపారుదల రంగానికి సంబంధించి సంపూర్ణ అవగాహన కలిగిన మాజీమంత్రి హరీశ్‌రావుకు కేసీఆర్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు బాధ్యత అప్పగించినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి ఢిల్లీకి వెళ్లిన హరీశ్‌రావు న్యాయ నిపుణులతో సంప్రదింపులు జరిపి శుక్రవారం మధ్యాహ్నం తిరిగి హైదరాబాద్‌కు వచ్చారు. కాగా బనకచర్ల ప్రాజెక్టుపై త్వరలో సుప్రీంకోర్టులో పిటిషన్ వేస్తారని బీఆర్ఎస్ వర్గాల సమాచారం

# 15న ట్రంప్, పుతిన్ భేటీ!



ఈ కబురు,వాషింగ్టన్: రష్యా, ఉక్రెయిన్ యుద్ధం ముగింపు దిశగా తీవ్ర ప్రయత్నాలు జరుగుతున్నాయి. అందులో భాగంగా ఈ నెల 15వ తేదీన అమెరికాలోని అలాస్కాలో దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌ల భేటీ జరగనుంది. ఈ విషయాన్ని స్వయంగా తన సోషల్ మీడియా వేదిక 'ట్రూత్ సోషల్' ద్వారా ట్రంప్ వెల్లడించారు. అయితే రష్యా నుంచి ఇంకా ఎటువంటి అధికారిక స్పందన రాలేదు. కానీ త్వరలో ఈ భేటీ ఉంటుందని ఇటీవలే ఆ దేశం వెల్లడించింది. పుతిన్‌తో సమావేశంలో యుద్ధాన్ని ముగించడంపై చర్చలు జరపనున్నామని ట్రంప్ తెలిపారు. శాంతి ఒప్పందంలో భాగంగా భూభాగాల మార్పిడి ఉంటుందని ఆయన వెల్లడించారు. అయితే దీనికి అంగీకరించేది లేదని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ స్పష్టం చేశారు. వాస్తవానికి అలాస్కాలో పుతిన్, జెలెన్‌స్కీతో త్రైపాక్షిక భేటీ నిర్వహించాలని ట్రంప్ భావించారు. ఇటీవల అమెరికా ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్‌కాఫ్ మాస్కో పర్యటన సమయంలోనూ ఇదే విషయాన్ని ప్రతిపాదించారు. కానీ దీనిపై క్రెమ్లిన్ నుంచి ఎటువంటి స్పందనా రాలేదని సమాచారం. దీంతో తొలుత పుతిన్‌తో ద్వైపాక్షిక భేటీ జరిపి కాల్పుల విరమణ ఒప్పందానికి ఒప్పించాలని ట్రంప్ యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ట్రంప్, పుతిన్‌ల భేటీని భారత్ స్వాగతించింది. ఇది యుద్ధాల కాలం కాదన్న ప్రధాని నరేంద్ర మోదీ వాదనకు ఈ ప్రయత్నాలు దోహదం చేస్తాయని శనివారం విదేశీ వ్యవహారాలశాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ వ్యాఖ్యానించారు.

భూభాగాల మార్పిడి ప్రతిపాదనపై వివాదం

శాంతి ఒప్పందం కోసం కొన్ని భూభాగాలను వెనక్కి తీసుకోవడం, మార్చుకోవడం జరుగుతుందని, ఇరు పక్షాలకు మేలు జరిగేలా ఈ భూభాగాల మార్పిడి ఉంటుందని ట్రంప్ వెల్లడించారు. దీన్ని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తోసిపుచ్చారు. 'ఉక్రెయిన్ ప్రాదేశిక సమగ్రతను దెబ్బతీసే చర్చలను ఆమోదించబోం. శాంతి స్థాపన కోసం నిర్వహించే సమావేశాల్లో మా గళాన్ని వినిపించాల్సిందే. అంతేగానీ ఆక్రమణదారులకు ఉదారంగా మా భూభాగాన్ని వదులుకోలేం. ఉక్రెయిన్ లేకుండా జరిపే చర్చల్లో ఏ పరిష్కారాలు నిర్ణయించినా అవన్నీ శాంతికి వ్యతిరేకమే. వాటితో సమస్య తీరదు. ఆ నిర్జీవ పరిష్కారాలు ఏమాత్రం పని చేయవు' అని జెలెన్‌స్కీ మండిపడ్డారు.

అలాస్కా ఎందుకు?

ట్రంప్, పుతిన్ సమావేశం ఎక్కడ జరుగుతుందన్న దానిపై గత కొన్ని వారాలుగా చర్చ సాగింది. కారణం ఏంటంటే.. పుతిన్‌పై అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు (ఐసీసీ).. యుద్ధ నేరాల ఆరోపణలతో అరెస్టు వారెంట్ జారీచేసింది. ఐసీసీ సభ్య దేశంలో పుతిన్ అడుగుపెడితే ఆయనను అదుపులోకి తీసుకోవాల్సిన చట్టపరమైన బాధ్యత ఆ దేశానికి ఉంటుంది. అమెరికా ఐసీసీలో సభ్యదేశం కాదు. కాబట్టి అమెరికా భూభాగమైన అలాస్కాకు పుతిన్ రావడంలో చట్టపరమైన అడ్డంకి ఉండదు. భౌగోళికంగా చూసుకున్నా రష్యా ప్రధాన భూభాగానికి అలాస్కా కేవలం 88 కి.మీ. దూరంలో ఉంటుంది. దీంతో రష్యా సరిహద్దు నుంచి సులభంగా చేరుకోవచ్చు.

కొన్ని దేశాల అడ్డుపుల్ల: రష్యా

ట్రంప్, పుతిన్‌ల భేటీకి అంతరాయం కలిగించేందుకు కొన్ని దేశాలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయని రష్యా పేర్కొంది. ఇందుకోసం రెచ్చగొట్టే ప్రకటనలు, తప్పుడు సమాచారం వ్యాప్తి చేస్తున్నాయని ఆరోపించింది.

# కేటీఆర్‌కు రాఖీ కట్టని కవిత.. పండుగ వేళ ఎందుకీ ఎడబాటు?



ఈ కబురు: రాష్ట్రమంతా రాఖీ పౌర్ణమి వేడుకలు జరుపుకుంటుండగా.. ప్రతీ రాఖీకి తమ అనుబంధాన్ని చాటే అన్నా చెల్లెళ్లు మాత్రం దూరంగా ఉన్నారు. ప్రతి ఏటా అన్నకు క్రమం తప్పకుండా రాఖీ కట్టే చెల్లెమ్మ.. ఈ సారి ఎడబాటును చూడాల్సిన పరిస్థితి వచ్చింది. కేటీఆర్ కవితల మధ్య ఏ ఏడాది లేనంత దూరం పెరిగినట్లు కనిపిస్తోంది. రాఖీ పౌర్ణమి సందర్భంగా.. అన్నకు రాఖీ కట్టేందుకు వస్తానంటే తాను హైదరాబాద్ లో లేనని, కలవలేనని చెప్పినట్లుగా కవిత సన్నిహిత వర్గాలు చెప్తున్నాయి. రాఖీ సెలబ్రేషన్స్ గురించి కొందరు విలేకరులు ఆమెను అడగ్గా.. అన్న కేటీఆర్ బెంగళూరులో ఉన్నట్లు చెప్పారని, ప్రస్తుతం తాను హైదరాబాద్ లో అందుబాటులో లేనని మెసేజ్ పెట్టారని తెలిపారు. అందుకే రాఖీ వేళ అన్నకు దూరంగా ఉండాల్సిన పరిస్థితి ఉందని చెప్పుకొచ్చారు. కేటీఆర్ బెంగళూరులో ఉండటమే ఇందుకు కారణమా? లేక కొన్నాళ్లుగా పార్టీ పరంగా నెలకొన్న విభేధాలు కారణంగా నిలిచాయా ? అని రాజకీయ వర్గాల్లో చర్చ మొదలైంది.

# క్విట్ ఇండియా స్ఫూర్తి నేటికీ అవసరమే పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్



హైదరాబాద్,ఈ కబురు: స్వాతంత్ర్య ఉద్యమం నాటి క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ప్రజలు దేశరక్షణతోపాటు కాంగ్రెస్ పార్టీ కోసం పాటుపడాలని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ పిలుపునిచ్చారు. దేశంలో క్విట్ భాజపా నినాదంతో ముందుకెళితేనే భవిష్యత్ తరాలకు మంచి జరుగుతుందని, రాష్ట్రంలో భారాసనూ క్విట్ తెలంగాణ అనాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు మిద్దెల జితేందర్ ఆధ్వర్యంలో శనివారం గాంధీభవన్‌లో క్విట్ ఇండియా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహేశ్‌కుమార్‌గౌడ్, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, నాయకులు వీహెచ్, కోదండరెడ్డి, టి.కుమార్‌రావు, జగదీశ్వర్‌రావు, శివచరణ్‌రెడ్డి, కార్పొరేషన్ల ఛైర్మన్లు మెట్టు సాయికుమార్, నూతి శ్రీకాంత్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు. మహాత్మాగాంధీ, నెహ్రూ, సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. మహేశ్‌కుమార్‌గౌడ్ పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆ విభాగం జెండా ఎగురవేశారు. బోగస్ ఓట్ల వ్యవహారంలో రాహుల్‌గాంధీ ఇటీవల దిల్లీలో ఇచ్చిన ప్రజంటేషన్ వీడియోను గాంధీభవన్‌లో ప్రదర్శించారు.

తెలంగాణలో బీసీ నేత సీఎం కావడం ఖాయం:

తెలంగాణలో ఎప్పటికైనా బీసీ నేత సీఎం అవ్వడం ఖాయమని మహేశ్‌కుమార్‌గౌడ్ పేర్కొన్నారు. ఆయన శనివారం విలేకరులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. 'ఈనెల 23 తర్వాత మళ్లీ జనహిత పాదయాత్ర మొదలుపెడతాం. నాలుగైదు రోజుల్లో పీసీసీ పీఏసీ సమావేశం ఏర్పాటు చేసి బీసీలకు 42% రిజర్వేషన్లపై నిర్ణయం తీసుకుంటాం. నాకు రేవంత్‌రెడ్డితో విభేదాలున్నట్లు దుష్ప్రచారం చేస్తున్నారు. జూబ్లీహిల్స్ అభ్యర్థి ఎంపికపై సర్వే జరుగుతుంది. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చాకే అభ్యర్థి ఎంపిక ఉంటుంది.

# హైదరాబాద్‌లో భారీ వర్షం



### సోమాజిగూడ కేసీపీ చౌరస్తాలో...

ఈ కబురు, హైదరాబాద్: రాజధాని నగరం హైదరాబాద్‌లో శనివారం రాత్రి భారీ వర్షం కురిసింది. ఎల్బీనగర్, మలక్‌పేట, దిల్‌సుఖ్‌నగర్, హిమాయత్‌నగర్, ఖైరతాబాద్, ముషీరాబాద్, సైదాబాద్, అంబర్‌పేట ప్రాంతాల్లో రహదారులు జలమయం అయ్యాయి. లక్డీకాపూల్ నుంచి కంట్రోల్‌రూం, నాంపల్లి, మొజంజాహీమార్కెట్ వరకు రహదారులకు ఇరువైపులా వరద పోటెత్తింది. కేసీపీ కూడలి, పంజాగుట్ట, మైత్రీవనం, అమీర్‌పేట, ఎర్రగడ్డ రహదారులపై మోకాళ్ల లోతు వరద చేరింది. వాహనాలు ముందుకు కదల్లేక పెద్ద ఎత్తున ట్రాఫిక్‌జాం అయింది. తొర్రూర్‌లో అత్యధికంగా 13 సెం.మీ, బేగంబజార్‌లో 11.8 సెం.మీ. వర్షపాతం నమోదైంది. కేసీపీ చౌరస్తాలో వాహనాలు మొరాయించడంతో సమస్య మరింత జటిలమైంది.

### రాజ్‌భవన్ రోడ్‌లో...

నేడు, రేపు, ఎల్లుండి కూడా...

దక్షిణ కోస్తాంధ్ర తీరం వద్ద ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో ఆది, సోమ, మంగళవారాల్లో పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ సూచించింది. నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, సిద్దిపేట, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, నాగర్‌కర్నూల్, కుమురం భీం ఆసిఫాబాద్, జనగామ, హనుమకొండ, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, నారాయణపేట జిల్లాల్లో పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఈ జిల్లాలకు 'పసుపు' రంగు హెచ్చరికలు జారీ చేసింది.



# రక్షాబంధన్... ట్రాఫిక్ చక్రబంధం



ఈ కబురు, హైదరాబాద్: వరుస సెలవులు, రాఖీ పౌర్ణమి నేపథ్యంలో సొంతూళ్లకు బయలుదేరిన జనంతో రహదారులన్నీ కిక్కిరిసిపోయాయి. రాజధానితో పాటు జిల్లా కేంద్రాల్లో శనివారం తీవ్ర ట్రాఫిక్ జామ్‌లతో ప్రజలు ఇబ్బందులుపడ్డారు. హైదరాబాద్ మహానగరం ట్రాఫిక్ చక్రబంధంలో చిక్కుకుంది. రెండ్రోజులుగా కురుస్తున్న వర్షంతో నగరంలోని రోడ్లన్నీ గుంతలమయంగా మారి... ప్రయాణం నరకాన్ని తలపించింది. గచ్చిబౌలి నుంచి మెహిదీపట్నం వైపు వచ్చే మార్గంలో షేక్‌పేట్ పైవంతెన వద్ద వాహనాలు నెమ్మదిగా ముందుకుసాగాయి. పైవంతెన కింద భాగంలో రోడ్డు నిర్మాణ పనులు సాగుతుండటంతో.. రాయదుర్గం, అత్తాపూర్, మెహిదీపట్నం, మాసబ్ ట్యాంక్, బంజారాహిల్స్ వరకు ట్రాఫిక్ సమస్యలు తలెత్తాయి. సాధారణ సమయాల్లో 20 నిమిషాలు పట్టే ప్రయాణానికి గంట సమయం వెచ్చించాల్సి వచ్చిందని వాహనదారులు వాపోయారు. మెట్రో, ఎంఎంటీఎస్ రైళ్లు సైతం ప్రయాణికులతో కిక్కిరిశాయి.నగర శివారు ప్రాంతాల్లో శనివారం ఉదయం నుంచే ట్రాఫిక్ రద్దీ నెలకొంది. మధ్యాహ్నానికి సికింద్రాబాద్‌ఉప్పల్, నాంపల్లి హయత్‌నగర్ మార్గాల్లో తీవ్రరూపు దాల్చింది. ఉప్పల్ జంక్షన్ వద్ద కిలోమీటరు మేర వాహనాలు బారులు తీరాయి. ఎల్.బి.నగర్ నుంచి అబ్దుల్లాపూర్‌మెట్ వరకూ నిలిచిపోయాయి. ట్రాఫిక్‌ని చక్కదిద్దేందుకు పోలీసులు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. రాష్ట్రంలోని ఆర్టీసీ బస్టాండ్లు ప్రయాణికుల రద్దీతో కిటకిటలాడాయి. వచ్చిన బస్సులు వచ్చినట్లే నిండిపోయాయి. గురువారం నుంచే ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడిపిస్తోంది. శనివారం వరకు మూడు రోజుల్లో 2,600 ప్రత్యేక బస్సులు నడిపించినట్లు ఆర్టీసీ ఉన్నతాధికారి ఒకరు 'ఈనాడు'కు తెలిపారు. సోమవారం వరకు అవసరమైన మేరకు ప్రత్యేక బస్సులు నడిపిస్తామని పేర్కొన్నారు.

పండగ రద్దీని దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక బస్సుల్లో ఛార్జీల్ని ఆర్టీసీ 50 శాతం వరకు పెంచింది. 2003 నాటి జీఓ 16 ఆధారంగా ప్రత్యేక బస్సుల ఛార్జీలను 50 శాతం వరకు 11వ తేదీ వరకు పెంచినట్లు ఆర్టీసీ యాజమాన్యం ఓ ప్రకటనలో తెలిపింది.ఉప్పల్ నుంచి హనుమకొండకు సాధారణ రోజుల్లో సూపర్ లగ్జరీ బస్సు ఛార్జీ రూ.340 ఉండగా.. శనివారం స్పెషల్ పేరుతో రూ.440 వసూలు చేసింది. రాజధాని ఏసీ బస్సు ఛార్జీ సాధారణ రోజుల్లో రూ.390 కాగా.. శనివారం రూ.550కి పెరిగింది. మిగతా రోజుల్లో ఏసీ బస్సు ఛార్జీ కంటే తాజాగా పెంచిన నాన్ ఏసీ బస్సు ఛార్జీ రూ.50 ఎక్కువగా ఉండటం గమనార్హం. అదనపు ఛార్జీలతో పాటు బస్సులు ఖాళీ లేక, సీట్లు దొరక్క ప్రయాణికులు వ్యయప్రయాసలకు గురయ్యారు. అనేక రూట్లలో రెగ్యులర్ బస్సులను కూడా 'స్పెషల్' పేరుతో నడిపించిందని పలువురు తెలిపారు. 'మహాలక్ష్మి' పథకంతో ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచిత ప్రయాణంతో సగటు ఓఆర్ (సీట్ల భర్తీ నిష్పత్తి) 94 శాతానికి చేరింది. శుక్రవారం 57.52 లక్షల మంది ప్రయాణించగా... ఓఆర్ 99% నమోదైంది. శనివారం 120 శాతానికి చేరుకుంటుందని అధికారుల అంచనా.మెట్రో రైళ్లలో శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు ప్రయాణికులు కిక్కిరిసి ప్రయాణించారు. ఎల్బీనగర్‌మియాపూర్, నాగోల్‌రాయదుర్గం మార్గాల్లో ఎక్కువ రద్దీ కనిపించింది. గంటల తరబడి ఎదురుచూసినా బస్సులు రాకపోవడం.. వచ్చినా నిండిపోయి ఉండటంతో ప్రయాణికులు మెట్రోను ఆశ్రయించారు. దాదాపుగా 5 లక్షల మంది మెట్రోలో రాకపోకలు సాగించి ఉంటారని అంచనా.

# సేవింగ్స్ అకౌంట్లో ₹50 వేలు ఉండాల్సిందే.. కొత్త కస్టమర్లకు ఐసీఐసీఐ షాక్




**ఇంటర్నెట్ డెస్క్:** పొదుపు ఖాతాల్లో మినిమమ్ బ్యాలెన్స్ లేనిపక్షంలో విధిస్తున్న అపరాధ రుసుమును ఇటీవల కొన్ని బ్యాంకులు ఎత్తివేస్తున్న సంగతి తెలిసిందే. కానీ ప్రైవేటు రంగ దిగ్గజ బ్యాంక్ ఐసీఐసీఐ మాత్రం అందుకు భిన్నంగా కస్టమర్లకు షాకిచ్చింది. సేవింగ్ అకౌంట్లలో కనీస సగటు నిల్వ మొత్తాన్ని పెంచేసింది. మెట్రో, అర్బన్, సెమీ అర్బర్, గ్రామీణ బ్రాంచ్ ఖాతాదారులందరిపై ఈ పెంపు ప్రభావం ఉంటుందని ఐసీఐసీఐ బ్యాంకు తెలిపింది. ఈ నిబంధన 2025 ఆగస్టు 1 తర్వాత సేవింగ్స్ ఖాతా తెరిచే కస్టమర్లకు వర్తించనుంది. ఇప్పటికే ఉన్న ఖాతాదారులకు వర్తించదు.

మారిన నిబంధనల ప్రకారం.. మెట్రో, అర్బన్ ప్రాంతాల్లో ఐసీఐసీఐ సేవింగ్ అకౌంట్ తీసుకునేవారు తమ సగటు నిల్వలను కనీసం రూ.50వేలు ఉంచాలి. గతంలో ఈ పరిమితి రూ.10వేల వరకు ఉండేది. ఇప్పుడు దాన్ని ఏకంగా ఐదు రెట్లు పెంచేసింది. ఇక, సెమీ అర్బన్ కస్టమర్ల కనీస సగటు నిల్వ మొత్తాన్ని రూ.5వేల నుంచి రూ.25వేలకు పెంచింది. గ్రామీణ ఖాతాదారులకు రూ.2,500 నుంచి రూ.10వేలకు పెంచేసింది. ఖాతాదారులు ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలని, కొత్త నిబంధనల ప్రకారం మినిమమ్ బ్యాలెన్స్ లేనిపక్షంలో ఛార్జీలు కట్టాల్సి ఉంటుందని ఐసీఐసీఐ వెల్లడించింది.

**ఎస్‌బీఐ లాభం రూ.21,201 కోట్లు**

ప్రస్తుతం దేశీయ బ్యాంకులు పొదుపు ఖాతాలపై అనుసరిస్తున్న కనీస సగటు నిల్వ మొత్తం నిబంధనల్లో ఇదే అత్యధికం కావడం గమనార్హం. హెచ్‌డీఎఫ్‌సీలో గరిష్ఠంగా రూ.10వేల కనీస నగదు నిబంధనను (మెట్రో/అర్బన్ నగరాల్లో) అమలుచేస్తున్నారు. యాక్సిస్ బ్యాంక్‌లో అయితే ఈ మొత్తం రూ.12వేలు (మెట్రో/అర్బన్)గా ఉంది. మినిమమ్ బ్యాలెన్స్ లేకపోతే ఆయా కస్టమర్ల నుంచి బ్యాంకులు కొంత మొత్తంలో ఛార్జీలు వసూలుచేస్తున్న సంగతి తెలిసిందే.

ఇదిలా ఉండగా.. ఈ ఛార్జీల నుంచి కొన్ని బ్యాంకులు మినహాయింపు కల్పించి ఖాతాదారులకు ఊరట కల్పిస్తున్నాయి. ప్రభుత్వ రంగ అతిపెద్ద బ్యాంకు ఎస్‌బీఐ.. 2020లోనే ఈ అపరాధ రుసుము నిబంధనను ఎత్తివేయగా.. ఇటీవల పంజాబ్ నేషనల్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, ఇండియన్ బ్యాంక్, కెనరా బ్యాంక్ కూడా ఈ ఛార్జీలను తొలగించాయి




## భారతీ ఎయిర్‌టెల్ బల్క్ డీల్.. రూ. 11,227 కోట్ల షేర్ల విక్రయం

**న్యూఢిల్లీ:** మొబైల్ టెలికం రంగ దిగ్గజం భారతీ ఎయిర్‌టెల్ ప్రమోటర్ సంస్థలలో ఒకటైన ఇండియన్ కాంటినెంట్ ఇన్వెస్ట్‌మెంట్ (ఐసీఐఎల్) తాజాగా 0.98 శాతం వాటా విక్రయించింది. ఎన్‌ఎస్‌ఈ బల్క్‌డీల్ గణాంకాల ప్రకారం రెండు దశలలో 6 కోట్ల షేర్లు అమ్మివేసింది. ఒక్కో షేరుకి రూ. 1,870-1,872 ధరల శ్రేణిలో రూ. 11,227 కోట్లకు వాటా విక్రయించింది.

అయితే కొనుగోలుదారుల వివరాలు వెల్లడికాలేదు. తాజా లావాదేవీ తదుపరి ఎయిర్‌టెల్‌లో ఐసీఐఎల్ వాటా 2.47 శాతం నుంచి 1.49 శాతానికి తగ్గింది. వెరసి మొత్తం ప్రమోటర్ల వాటా 51.25 శాతం నుంచి 50.27 శాతానికి దిగివచ్చింది. ప్రమోటర్లలో భారతీ టెలికం అత్యధికంగా 40.47 శాతం వాటా కలిగి ఉంది. వాటా విక్రయం నేపథ్యంలో ఎయిర్‌టెల్ షేరు ఎన్‌ఎస్‌ఈలో 3.3 శాతం క్షీణించి రూ. 1,860 వద్ద ముగిసింది.

# ఉమాంగ్ యాప్‌లో యూఏఎన్.. ఈపీఎఫ్ఓ కొత్త రూల్

**ఉమాంగ్ యాప్‌లో యూఏఎన్ యాక్టివేషన్‌కు సంబంధించి ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఈపీఎఫ్ఓ) కొత్త నిబంధన తీసుకొచ్చింది. ఈ యాప్ ద్వారా యూఏఎన్ పొందడానికి, యాక్టివేట్ చేసుకునేందుకు ఫేస్ ఆథెంటికేషన్ టెక్నాలజీ (ఎఫ్ఏటీ)ని తప్పనిసరి చేసింది. ఈ కొత్త ప్రక్రియ ఆగస్టు 1 నుంచి అమల్లోకి వచ్చింది.**

**యూఏఎన్ అంటే యూనివర్సల్ అకౌంట్ నంబర్. ఈపీఎఫ్ఓ సభ్యులు అకౌంట్ బ్యాలెన్స్ చెక్ చేసుకునేందుకు, వివరాలను అప్డేట్ చేసేందుకు, ఈపీఎఫ్ నిధులను ఉపసంహరించుకునేందుకు, ఎంప్లాయిమెంట్ లింక్డ్ ఇన్సెంటివ్ (ఈఎల్ఐ) వంటి పథకాల కింద ప్రయోజనాలు పొందడానికి యూఏఎన్ అవసరం. యూఏఎన్ యాక్టివేట్ చేయకుండా సభ్యులు ఈ ఆన్‌లైన్ సేవలను పొందలేరు.**

**ఉమాంగ్ యాప్ గురించి..**

యూనిఫైడ్ మొబైల్ అప్లికేషన్ ఫర్ న్యూ ఏజ్ గవర్నెన్స్ (ఉమాంగ్) అనేది ఒక ప్రభుత్వ యాప్. ఇది ఒకే ప్లాట్‌ఫామ్‌పై అనేక ఈగవర్నెన్స్ సేవలను అందిస్తుంది. ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ (ఎంఈఐటీవై), నేషనల్ ఈగవర్నెన్స్ డివిజన్ (ఎన్ఈజీడీ) అభివృద్ధి చేసిన ఈ యాప్ ద్వారా పౌరులు కేంద్ర, రాష్ట్ర, స్థానిక ప్రభుత్వ సంస్థల సేవలను వినియోగించుకోవచ్చు.

ఉమాంగ్ యాప్ ద్వారా ఈపీఎఫ్ఓ సభ్యులు ఇప్పుడు వారి యూఏఎన్‌ను జనరేట్ లేదా యాక్టివేట్ చేసుకోవచ్చు. బయోమెట్రిక్ రికార్డులను అప్డేట్ చేయవచ్చు. ఈపీఎఫ్ఓ కార్యాలయానికి వెళ్లకుండానే తమ స్మార్ట్‌ఫోన్ల నుండి నేరుగా వారి ఈయూఏఎన్ కార్డును డౌన్లోడ్ చేసుకోవచ్చు. అంతర్జాతీయ కార్మికులు, నేపాల్, భూటాన్ పౌరులకు తప్ప మిగతా ఉద్యోగులందరికీ ఆగస్టు 1 నుంచి ఉమాంగ్ యాప్ ద్వారా యూఏఎన్ జనరేషన్ లేదా యాక్టివేషన్‌కు ఆధార్ ఆధారిత ఫేస్ అథెంటికేషన్‌ను ఈపీఎఫ్‌వో తప్పనిసరి చేసింది.




## టాటా మోటార్స్ లాభంలో 62% క్షీణత

**దిల్లీ:** టాటా మోటార్స్, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (202526) మొదటి త్రైమాసికంలో ఏకీకృత ప్రాతిపదికన రూ.4,003 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. 202425 ఇదే త్రైమాసిక లాభం రూ.10,587 కోట్లతో పోలిస్తే ఇది 62.2% తక్కువ. అన్ని విభాగాల్లో అమ్మకాలు తగ్గడం కారణం. అమెరికా టారిఫ్‌ల కారణంగా జాగ్వార్ ల్యాండ్ రోవర్ (జేఎల్ఆర్) లాభాలు తగ్గడమూ ప్రభావం చూపింది. మొత్తం కార్యకలాపాల ఆదాయం రూ.1,07,102 కోట్ల నుంచి రూ.1,04,407 కోట్లకు తగ్గింది. 'అమెరికా టారిఫ్‌లపై స్పష్టత రావడంతో పాటు, పండగల గిరాకీ పుంజుకుంటే.. రాబోయే రోజుల్లో మెరుగైన ఫలితాలు సాధిస్తాం. వచ్చే అక్టోబరులో కంపెనీ (వాణిజ్యప్రయాణికుల వాహన విభాగాలుగా) విభజన ఉండటంతో.. ఈ ఆర్థిక సంవత్సరం ద్వితీయార్ధం మరింత కీలకం అవుతుంద'ని కంపెనీ సీఎఫ్ఓ పీబీ బాలాజీ పేర్కొన్నారు.


**జేఎల్ఆర్‌పై టారిఫ్‌ల ప్రభావం**

ఏప్రిల్ జులైలో జేఎల్ఆర్ ఆదాయాలు 9.2% తగ్గి 6.6 బిలియన్ పౌండ్లకు పరిమితమయ్యాయి. బ్రిటన్, ఐరోపాలో ఉత్పత్తి అయిన కార్లపై అమెరికా సుంకాలు విధించడం ప్రతికూల ప్రభావం చూపింది. అయితే బ్రిటన్ అమెరికా, ఐరోపా సమాఖ్యఅమెరికా మధ్య వాణిజ్య ఒప్పందాలు కుదిరినందున, రాబోయే త్రైమాసికాల్లో మెరుగైన ఫలితాలు రావొచ్చని కంపెనీ ఆశిస్తోంది.

**దేశీయంగా అమ్మకాలు తగ్గాయి**

ఏప్రిల్‌జూన్‌లో దేశీయంగా ప్రయాణికుల వాహనాల (పీవీ) అమ్మకాలు ఏడాది క్రితం ఇదే కాలంతో పోలిస్తే 10.1% తగ్గి 1,24,800కు చేరాయి. అల్ట్రోజ్, హ్యారియర్, సఫారీ మోడళ్లలో మార్పుల కోసం, ఆయా వాహనాల అమ్మకాలు నిలపడం ఇందుకు కారణమయ్యాయి. పరిశ్రమ వ్యాప్తంగా కూడా అమ్మకాలు తగ్గాయని సంస్థ గుర్తు చేసింది. వాణిజ్య వాహన అమ్మకాలు 6% తగ్గి 88,000కు చేరాయి. టాటా మోటార్స్, జేఎల్ఆర్ విద్యుత్ వాహనాల ఉత్పత్తిపై అరుదైన భూ అయస్కాంతాల కొరత ప్రభావం లేదని, సమీప భవిష్యత్తులో కూడా ఉండకపోవచ్చని పీబీ బాలాజీ అంచనా వేశారు.

# పండగల వేళ రైల్వే ఆఫర్.. రిటర్న్ టికెట్‌పై 20% డిస్కౌంట్




**పండగల సీజన్ మొదలైంది. సామాన్యులు ఊళ్లకు వెళ్లేందుకు రైలు ప్రయాణానికి ఎక్కువగా మొగ్గు చూపుతుంటారు. ఈక్రమంలో ఆహ్లాదకరమైన రైల్వే ప్రయాణాన్ని అందించేందుకు భారతీయ రైల్వే ప్రయాణికులకు బంపర్ ఆఫర్ ప్రకటించింది. 'రౌండ్ ట్రిప్ ప్యాకేజీ' పేరుతో కొత్త పథకాన్ని ప్రవేశపెట్టింది. దీంతో రిటర్న్ టికెట్ బుకింగ్‌పై 20 శాతం రాయితీ ఇవ్వనుంది. రైల్వేశాఖ ఈ మేరకు ఓ ప్రకటనలో పేర్కొంది.**

**పండగ సమయాల్లో అప్పటికప్పుడు రద్దీని నివారించి ముందస్తు రిజర్వేషన్‌ను ప్రోత్సహించడంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. ఇరువైపులా ప్రయాణికుల సంఖ్యను పెంచేందుకు ఇది దోహదపడుతుందని అభిప్రాయపడింది. రైల్లో ఊరెళ్లిన ప్రయాణికులు తిరుగు ప్రయాణంలోనూ టికెట్ బుక్ చేసుకున్నప్పుడే ఇది వర్తిస్తుందని అధికారులు తెలిపారు. బుకింగ్ సమయంలో ప్రయాణికులు ఇచ్చే వివరాల ఆధారంగా ఈ రాయితీ అందుతుంది.**

# ఎస్‌బీఐ లాభం రూ.21,201 కోట్లు



**దిల్లీ:** స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ఫలితాల్లో రాణించింది. జూన్ త్రైమాసికంలో ఏకీకృత ప్రాతిపదికన నికర లాభం 9.71% వృద్ధితో రూ.21,201 కోట్లుగా నమోదైంది. ఇందుకు ట్రెజరీ, ఫారెక్స్ ఆదాయాలు కలిసొచ్చాయి. స్టాండలోన్ పద్ధతిన బ్యాంకు నికర లాభం రూ.17,035 కోట్ల నుంచి రూ.19,160 కోట్లకు పెరిగింది.

రెపో రేటు తగ్గింపుతో ఎన్ఐఎమ్‌పై ప్రభావం: ఆర్‌బీఐ రెపో రేటును తగ్గించిన నేపథ్యంలో బ్యాంక్ నికర వడ్డీ మార్జిన్ (ఎన్ఐఎమ్) 0.33% తగ్గి 3.02 శాతానికి చేరింది. దీంతో నికర వడ్డీ ఆదాయం 0.13% తగ్గి రూ.41,072 కోట్లకు పరిమితమైంది. 'ప్రస్తుత జులైసెప్టెంబరు త్రైమాసికంలోనూ సవాళ్లు ఉండొచ్చు. 202526 మొత్తంమీద 3% ఎన్ఐఎమ్‌ను లక్ష్యంగా పెట్టుకున్న'ట్లు బ్యాంక్ ఛైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి తెలిపారు. వడ్డీయేతర ఆదాయం 55% పెరిగి రూ.17,346 కోట్లకు పెరగడంతో, బ్యాంక్ లాభాల్లో వృద్ధి సాధ్యమైంది. రుణ వృద్ధి అంచనాను 12 శాతంగా కొనసాగిస్తున్నట్లు శెట్టి పేర్కొన్నారు.

స్థూల నిరర్థక ఆస్తుల నిష్పత్తి 2.21% నుంచి 1.83 శాతానికి, నికర నిరర్థక ఆస్తుల నిష్పత్తి 0.57% నుంచి 0.47 శాతానికి మెరుగయ్యాయి.

ఐటీలో లేఆఫ్‌లు, ట్రంప్ టారిఫ్‌ల ప్రభావం లేదు: 'అమెరికా టారిఫ్‌లతో ప్రభావితమయ్యే 45 రంగాల సంస్థలకు బ్యాంకు రుణాలిచ్చినప్పటికీ.. మొత్తం రుణాల్లో వాటి వాటా 2% లోపే ఉంది. కాబట్టి బ్యాంకుపై పెద్ద ప్రబావం ఉండద'ని శెట్టి తెలిపారు. ఐటీ రంగంలో ఉద్యోగులకు లేఆఫ్‌ల ప్రభావం కూడా తమపై పడదన్నారు. తమ వ్యక్తిగత రుణాల్లో అధిక భాగం ప్రభుత్వ ఉద్యోగులవేనని స్పష్టం చేశారు.

**పీఎస్‌బీల రికార్డు లాభం**

ఎస్‌బీఐ సహా 12 ప్రభుత్వ రంగ బ్యాంకు(పీఎస్‌బీ)లు కలిసి జూన్ త్రైమాసికంలో రూ.44,218 కోట్ల రికార్డు స్థాయి లాభాన్ని నమోదు చేశాయి. 202425 ఇదే సమయంలోని రూ.39.,974 కోట్లతో పోలిస్తే ఇది 11% అధికం. మొత్తం బ్యాంకుల లాభంలో 43 శాతాన్ని ఎస్‌బీఐ ఒక్కటే అందజేయడం విశేషం. తొలి త్రైమాసికంలో పీఎన్‌బీ మినహా మిగతా అన్ని బ్యాంకుల లాభాలు పెరిగాయి. అత్యధికంగా ఐఓబీ 76% వృద్ధిని సాధించింది.

# మహేశ్ బాబు సినిమా.. కీలక అప్డేట్ ఇచ్చిన రాజమౌళి

**మహేశ్‌బాబు నేడు (ఆగష్టు 9) పుట్టినరోజు జరుపుకుంటున్నారు. ఈ సందర్భంగా తను హీరోగా రూపొందుతోన్న తాజా చిత్రం 'ఎస్ఎస్ఎమ్‌బీ 29' (వర్కింగ్ టైటిల్) నుంచి దర్శకుడు రాజమౌళి ఒక అప్డేట్ ఇచ్చారు. చాలా కాలంగా ఈ సినిమా వివరాల కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు. ఈ సినిమా కథ ఏంటి? షూటింగ్ ఎంత వరకూ వచ్చింది? వంటి విషయాలపై చిత్ర బృందం నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాకపోవడంతో మహేశ్ అభిమానుల్లో నిరాశ ఏదురైంది. అయితే, తాజాగా జక్కన్న చేసిన ప్రకటనతో కాస్త రిలాక్స్ అయ్యారు.**

మహేశ్‌బాబు సినిమా గురించి ఉద్దేశిస్తూ రాజమౌళి ఇలా పోస్ట్ చేశారు.. 'భారతదేశం, ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రియమైన సినిమా ప్రేమికులారా, అలాగే మహేశ్ అభిమానులారా.. మేము షూటింగ్ ప్రారంభించి చాలా కాలం అయింది. ఈ చిత్రం గురించి తెలుసుకోవాలనే మీ ఆసక్తిని మేము అభినందిస్తున్నాము. అయితే, ఈ సినిమా కథ పరిధి చాలా విస్తృతమైనది. కేవలం ప్రెస్‌మీట్ పెట్టి ఆపై కొన్ని పోస్టర్స్ విడుదల చేయడం వల్ల ఈ ప్రాజెక్ట్‌కు పూర్తిస్థాయిలో న్యాయం చేయలేమని నేను భావిస్తున్నాను. ప్రస్తుతం మేము ఒక ప్రపంచాన్ని సృష్టిస్తున్నాం. చాలా లోతైన సబ్జెక్ట్ కోసం కష్టపడుతున్నాం. ఒక అద్భుతాన్ని చూపించేందుకు నిరంతరం శ్రమిస్తూనే ఉన్నాం. అయితే, నవంబర్ 2025లో ఈ సినిమా గురించి ఆవిష్కరిస్తాం. అప్పుడు పూర్తి వివరాలు తెలుస్తాయి. ఎంతో కాలంగా ఓపికతో ఉన్న మీ అందరికీ ధన్యవాదాలు.' అని రాజమౌళి పేర్కొన్నారు.

అయితే ఆఫ్రికా అడవుల నేపథ్యంలో సాగే 'ఇండియానా జోన్స్' స్టైల్ కథతో ఈ సినిమా రూపొందుతోందనే వార్తలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉంటే... ఈ కథలో విలన్ ఎవరు? అనే విషయం సినిమా ముగిసేవరకూ ఊహించలేమట. పతాక సన్నివేశాల వరకు నెగెటివ్ రోల్ తెలియనివ్వకుండా ప్రేక్షకులను సస్పెన్స్ చేయనున్నారట రాజమౌళి. ఈ చిత్రంలో మాధవన్ కీలకపాత్రలో కనిపించనున్నారనే వార్త ప్రచారంలోకి వచ్చింది. దాంతో ఆయన విలన్‌గా కనిపించనున్నారనే ఊహాగానాలు మొదలయ్యాయి. ఈ సినిమాలో హీరోయిన్ ప్రియాంకా చోప్రా హీరో పృథ్వీరాజ్ సుకుమారన్ కీలకపాత్రలు చేస్తున్నారు. కేఎల్ నారాయణ నిర్మిస్తున్నారు.







## వైరలవుతోన్న రామ్‌చరణ్ 'పెద్ది'.. కారణమిదే!

రామ్‌చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో రానున్న చిత్రం 'పెద్ది' చరణ్ అభిమానులు ఈ సినిమా అప్‌డేట్స్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. తాజాగా దీనికి సంబంధించిన కొన్ని వార్తలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

గతంలో 'రంగస్థలం' సినిమాతో రామ్ చరణ్ - సమంత ప్రేక్షకులను అలరించారు. ఇప్పుడు మరోసారి ఈ జోడి స్క్రీన్‌పై మెరవనున్నట్లు వార్తలు వస్తున్నాయి. పెద్ది సినిమాలో సమంత స్పెషల్ సాంగ్ చేయనున్నట్లు టాక్ వినిపిస్తోంది. ఇప్పటికే సమంత 'పుష్ప'లో చేసిన సాంగ్ ప్రపంచవ్యాప్తంగా ట్రెండ్ సృష్టించింది. ఇప్పుడు మరోసారి అదేతరహాలో ప్రత్యేక పాటలో కనిపించి స్టెప్పులు వేయనున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాను ప్రకటించినప్పుడు ఇందులో సమంత కూడా కనిపించనున్నట్లు వార్తలు వచ్చాయి. కాగా, దీనిపై అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు.


ఇక 'పెద్ది'లో తనకు రామ్‌చరణ్ అవకాశం ఇచ్చారని ప్రముఖ కాస్ట్యూమ్ డిజైనర్ ఎకమ్ తెలిపారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆయన 'తంగలాన్'లో తన వర్క్ చూసి రామ్‌చరణ్ పెద్దిలో అవకాశం ఇచ్చినట్లు చెప్పారు. ఈ సినిమాతో తెలుగు ఇండస్ట్రీకి పరిచయం అవుతున్నందుకు ఎంతో సంతోషంగా ఉందన్నారు దీంతో ఈ వార్తను చరణ్ అభిమానులు షేర్ చేస్తున్నారు. మరోవైపు పెద్ది షూటింగ్ ప్రస్తుతం రామోజీ ఫిల్మ్‌సిటీలో జరుగుతోంది. అందులోభాగంగా రామ్‌చరణ్‌తోపాటు, ఇతర తారాగణంపై ఓ వేడుక నేపథ్యంలో సాగే సన్నివేశాల్ని తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమా కోసం ప్రత్యేకంగా సెట్‌ని తీర్చిదిద్దారు. ఉత్తరాంధ్ర నేపథ్యంలో సాగే పీరియాడిక్ చిత్రమిది. వచ్చే ఏడాది మార్చి 27న విడుదల కానుంది.



## దుల్కర్-భాగ్యశ్రీ సినిమా.. తొలి పాట రిలీజ్

విభిన్న చిత్రాలు చేస్తూ తెలుగులోనూ మంచి ఫాలోయింగ్ సొంతం చేసుకున్న మలయాళ నటుడు దుల్కర్ సల్మాన్. ప్రస్తుతం 'కాంత' అనే మూవీ చేస్తున్నాడు. రానా నిర్మిస్తున్న ఈ చిత్రం టీజర్.. కొన్నిరోజుల క్రితం రిలీజ్ చేశారు. మంచి రెస్పాన్స్ కూడా వచ్చింది. వచ్చే నెల 12న మూవీని థియేటర్లలోకి తీసుకురానున్నారు. ఈ క్రమంలోనే ప్రమోషన్స్ మొదలుపెట్టారు. అలా తొలి పాటని విడుదల చేశారు.

'పసి మనసే' అంటూ సాగే పాటని తాజాగా రిలీజ్ చేశారు. ఇందులో దుల్కర్-భాగ్యశ్రీ డ్యాన్స్.. పాత సినిమాల్లో పాటల్ని గుర్తుచేస్తోంది. సినిమా బ్యాక్ గ్రౌండ్ కథతో తీసిన ఈ సినిమాలో దుల్కర్ హీరో పాత్ర పోషిస్తుండగా, సముద్రఖని దర్శకుడిగా కనిపించబోతున్నారు. ఓ మూవీ తీసే విషయమై వీళ్లిద్దరి మధ్య ఎలాంటి ఈగోలు చోటుచేసుకున్నాయి. చివరకు ఏమైందనే కాన్సెప్ట్‌తో మూవీని తెరకెక్కించారు.




## జడల్... హడల్

నరకంలోకి నడిచి దాన్ని స్వర్గంగా మార్చేశాడంటూ 'ది ప్యారడైజ్' సినిమాలోని కథానాయకుడి పాత్రని పరిచయం చేశారు శ్రీకాంత్ ఓదెల. ఆయన దర్శకత్వంలో నాని కథానాయకుడిగా తెరకెక్కుతున్న చిత్రం 'ది ప్యారడైజ్'. ఎస్.ఎల్.వి సినిమాస్ పతాకంపై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. శుక్రవారం వరలక్ష్మి వ్రతం సందర్భంగా నాని లుక్‌ని విడుదల చేయడంతోపాటు, ఆయన పోషిస్తున్న పాత్ర వివరాల్ని వెల్లడించింది చిత్రబృందం. లుక్‌లో రెండు జడలతో కనిపిస్తున్నారు నాని. ఇందులో ఆయన పాత్ర పేరు కూడా జడల్ అని చిత్రబృందం తెలిపింది. లుక్‌లో కత్తులు, బుల్లెట్లు, బ్లేడ్‌లతోపాటు నాని రూపం హడలెత్తించేలా ఉంది. విజయవంతమైన 'దసరా' తర్వాత నాని - శ్రీకాంత్ ఓదెల - సుధాకర్ చెరుకూరి కలిసి చేస్తున్న చిత్రమిది. హైదరాబాద్ - సికింద్రాబాద్ నేపథ్యంలో, ఓ పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా రూపొందుతోంది. ఇందులో బాలీవుడ్ నటుడు రాఘవ్ జుయల్ కీలక పాత్రని పోషిస్తున్నారు. వచ్చే ఏడాది మార్చి 26న తెలుగుతోపాటు హిందీ, తమిళ, కన్నడ, మలయాళ, బెంగాలీ, ఇంగ్లిష్, స్పానిష్ భాషల్లో ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: సీహెచ్ సాయి, కూర్పు: నవీన్ నూలి, ప్రొడక్షన్ డిజైన్: అవినాశ్ కొల్లా, సంగీతం: అనిరుధ్ రవిచందర్.



## 10వేల క్రిస్టల్స్, ఐవరీ వైట్ లెహంగాలో జాన్వీ డాజ్లింగ్ లుక్

**బ్రైడల్ షోలో పలువురు మెరిసిన తారలు**

ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ గౌరవ్ గుప్తా తన బ్రైడల్ కోచర్ కలెక్షన్ క్వాంటం ఎంటాంగిల్‌మెంట్‌ను ముంబైలో ఆవిష్కరించారు ఈ బ్రైడల్ కోచర్ షోలో బాలీవుడ్ హీరోయిన్ జాన్వీ కపూర్ అందంగా మెరిసిపోయింది. మొన్న మసాబా గుప్తా బ్రైడల్‌గా అందంగా మురిపించిన జాన్వీ తాజాగా గౌరవ్ గుప్తా డిజైన్ చేసిన లెహంగాలో అభిమానులను మెస్మరైజ్ చేసింది. జాన్వీ ధరించిన లెహంగాకు సంబంధించి కొన్ని వివరాలను గౌరవ్ గుప్తా ఇన్‌స్టాలో షేర్ చేశారు.

ఐవరీ వైట్ స్వర్ణమ లెహంగా, పొడవైన దుపట్టాలో అద్భుతమైన లుక్‌లో జాన్వీ అందర్నీ మంత్రముగ్ధులను చేసింది. ఈ షోలో జాన్వీ షోస్టాపర్‌గా నిలిచింది. గౌరవ్‌తో కలిసి అభిమానులను పలకరించింది. దీనికి తోడు డైమండ్ ఆభరణాలతో దేవకన్యలా మెరిసింది. 10వేలకు పైగా స్ఫటికాలతో ఈ లెహంగాను డిజైన్ చేశారట. అంతేకాదు జాన్వీ సోదరి ఖుషీ కపూర్‌లో కూడా ఈ బ్రైడ్‌ల్ షోలో సందడి చేసింది. ఈ ఇంకా షోలో డైరెక్టర్ కిరణ్‌రావు, దుల్కర్ సల్మాన్, విజయ్ వర్మ, మలైకా అరోరా, శ్రియా శరణ్ దిశా పఠాని, తదితర ఫిలిం స్టార్లు, పలువురు మోడల్స్ మెరిసారు. ఈ షోకు సంబంధించిన ఫోటోలు నెట్టింట వైరల్‌గా మారాయి.

# టీమిండియా ఘోర ఓటమి.. 73 పరుగులకే ఆలౌట్



ఆస్ట్రేలియా పర్యటనలో భారత్'ఎ' మహిళా జట్టుకు వరుసగా రెండో ఓటమి చవిచూసింది. మెక్‌కే వేదికగా ఆసీస్‌ఎ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో 114 పరుగుల తేడాతో భారత్ పరాజయం పాలైంది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఆసీస్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 187 పరుగులు చేసింది.
ఆస్ట్రేలియా బ్యాటర్లలో సీనియర్ టీమ్ కెప్టెన్ అలీసా హీలీ(44 బంతుల్లో 12 ఫోర్లతో 70) టాప్ స్కోరర్‌గా నిలవగా.. విల్సన్(43), అనికా లియార్డ్(35) రాణించారు. భారత బౌలర్లలో కెప్టెన్ రాధా యాదవ్ రెండు వికెట్లు పడగొట్టగా..ప్రేమా రావత్ ఒక్క వికెట్ సాధించారు.

**చెలరేగిన గార్త్..**

అనంతరం లక్ష్య చేధనలో ఇండియాఎ జట్టు ఆసీస్ బౌలర్ల దాటికి కేవలం 73 పరుగులకే కుప్పకూలింది. పేసర్ కిమ్ గార్త్ నాలుగు వికెట్లతో పర్యాటక జట్టు పతనాన్ని శాసించింది. ఆమెతో పాటు, ఎడ్గర్,ఫ్లింటాప్ తలా రెండు వికెట్లు పడగొట్టారు.
భారత బ్యాటర్లలో వ్రింధా దినేష్(21), మిన్ను మణి(20) రెండెంకల స్కోర్‌ను అందుకోగా.. మిగితా వారిందరూ సింగిల్ డిజిట్ స్కోర్‌కే పరిమితమయ్యారు. స్టార్ ఓపెనర్ షెఫాలీ వర్మ(3) సైతం బ్యాట్ ఝుళిపించకలేకపోయారు.
ఈ విజయంతో మూడు టీ20 సిరీస్‌ను ఆసీస్ఎ జట్టు మరో మ్యాచ్ మిగిలూండగానే సొంతం చేసుకుంది. ఇక ఇరు జట్ల మధ్య నామమాత్రపు మూడో టీ20 మెక్‌కే వేదికగా ఆదివారం జరగనుంది.



# కోహ్లీ ఇచ్చిన కానుకను పదిలంగా దాచుకున్న సిరాజ్!

విరాట్ కోహ్లీ , మహ్మద్ సిరాజ్ మధ్య ప్రత్యేక అనుబంధం ఉంది. కోహ్లీ చివరిసారిగా ధరించిన టెస్ట్ జెర్సీని సిరాజ్‌కు కానుకగా ఇచ్చాడు. దాన్ని మహ్మద్ సిరాజ్ పదిలంగా తన ఇంట్లో దాచుకున్నాడు. జస్‌ప్రీత్ బుమ్రా తర్వాత, సిరాజ్.. టీమ్‌ఇండియాకు కీలక బౌలర్‌గా మారాడు. తాజాగా ముగిసిన తెందూల్కర్ అండర్సన్ ట్రోఫీలోనూ అయిదు మ్యాచుల్లో 23 వికెట్లు తన ఖాతాలో వేసుకున్నాడు. అలాగే రెండు సార్లు అయిదు వికెట్ల ప్రదర్శన కూడా చేశాడు.
ముఖ్యంగా ఈ ట్రోఫీలో భాగంగా ఓవల్ వేదికగా జరిగిన చివరి మ్యాచ్‌లో టీమ్‌ఇండియా ఆరు పరుగుల తేడాతో గెలిచి, సిరీస్‌ను సమం చేయడంలో.. సిరాజ్ కీలకపాత్ర పోషించాడు. ఈ మ్యాచ్‌లో అతడు రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి తొమ్మిది వికెట్లు తీసుకున్నాడు. ఇప్పటి వరకు 41 టెస్ట్ మ్యాచ్‌లు ఆడిన సిరాజ్ 123 వికెట్లు పడగొట్టాడు. ఇంగ్లాండ్ టూర్‌లో టీమ్‌ఇండియా విజయం సాధించిన తర్వాత విరాట్ కోహ్లీ.. సోషల్ మీడియా వేదికగా సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణను ప్రశంసించాడు. ముఖ్యంగా మహ్మద్ సిరాజ్ అద్భుతంగా రాణించి, టీమ్‌ఇండియా విజయంలో కీలకపాత్ర పోషించాడని కొనియాడాడు. దానికి సిరాజ్ కూడా స్పందిస్తూ.. విరాట్ కోహ్లీకి కృతజ్ఞతలు తెలిపాడు.

విరాట్ కోహ్లీ, మహ్మద్ సిరాజ్ మధ్య చాలా ప్రత్యేకమైన అనుబంధం ఉంది. ఐపీఎల్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు విరాట్ కోహ్లీ కెప్టెన్సీలో మహ్మద్ సిరాజ్ ఆడాడు. అతడిలోని ప్రతిభను గుర్తించిన కోహ్లీ ప్రత్యేకంగా ప్రోత్సహించాడు. సిరాజ్‌ను వరల్డ్ క్లాస్ బౌలర్‌గా తీర్చిదిద్దడంలో విరాట్ కోహ్లీ పాత్ర కూడా ఉంది! ఈ నేపథ్యంలో వారి మధ్య స్నేహం చిగురించింది. అందుకే విరాట్ కోహ్లీ టెస్ట్ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన తర్వాత.. అతడు లేని డ్రెస్సింగ్ రూమ్ అసంపూర్ణంగా ఉందని సిరాజ్ వాపోయాడు. ప్రస్తుతం ఈ పేసర్ ఇంట్లో ఉన్న కోహ్లీ జెర్సీ.. కేవలం ఓ జ్ఞాపకం మాత్రమే కాదు.. వారిద్దరి మధ్య ఉన్న అనుబంధానికి, స్నేహానికి గుర్తు అని క్రికెట్ అభిమానులు అంటున్నారు.




# పెనాల్టీ పడినా.. వెనక్కి తగ్గొద్దన్న గంభీర్!

**ఇంటర్నెట్ డెస్క్:** ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్‌కు చేరుకోవాలంటే పాయింట్ల పట్టికలో టాప్2లో ఉండాలి. అందుకోసం ప్రతి పాయింట్, పర్సంటేజీ అత్యంత కీలకం. స్లో ఓవర్ రేట్ కారణంగా కొన్నిసార్లు పాయింట్లను కోల్పోవాల్సిన పరిస్థితి ప్రతి జట్టుకూ ఎదురవుతుంది. అయితే, ప్రత్యర్థిపై విజయం కోసం అలాంటివాటిని పట్టించుకోవద్దని భారత్ ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ తన టీమ్‌కు ఇచ్చిన సందేశం ఇప్పుడు వైరల్‌గా మారింది. ఇంగ్లాండ్‌తో ఐదో టెస్టు ఐదో రోజు ఐసీసీ నుంచి వచ్చిన వార్నింగ్‌పై గంభీర్ స్పందించిన తీరు అభిమానులను ఆకట్టుకుంది.

ఓవల్ వేదికగా జరిగిన చివరి మ్యాచ్‌లో భారత్ విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఆఖరి రోజున టీమ్‌ఇండియాకు 4 వికెట్లు అవసరం కాగా.. ఇంగ్లాండ్‌కు 35 పరుగులు మాత్రమే కావాలి. ఇలాంటి పరిస్థితుల్లో అప్పటికే భారత జట్టు 6 ఓవర్లు వెనకబడి ఉంది. దానిని కవర్ చేయడం లేదా ఇంగ్లాండ్‌ను త్వరగా ఆలౌట్ చేయడమే గిల్‌సేన ముందున్న సవాళ్లు. లేకపోతే డబ్ల్యూటీసీలో పాయింట్లను కోల్పోయే ప్రమాదం ఉంది. భారత కోచింగ్ బృందంలోని ఓ సభ్యుడు మాత్రం 'స్పిన్నర్లతో కొన్ని ఓవర్లు వేయిస్తే బెటర్' అని సలహా ఇచ్చాడు. కానీ, స్లో ఓవర్ పెనాల్టీ కంటే విజయం ముఖ్యమనే ఉద్దేశంతో గంభీర్ 'పేసర్లతోనే బౌలింగ్ చేయిద్దాం' అని సూచించాడు. సిరాజ్, ప్రసిద్ధ్ అద్భుతంగా బంతులేసి జట్టును గెలిపించారు. గంటలోపే నాలుగు వికెట్లను పడగొట్టడం విశేషం.

**ఆటగాళ్ల జెర్సీల వేలం**

అండర్సన్ తెందూల్కర్ ట్రోఫీలో ఆడిన భారత, ఇంగ్లాండ్ క్రికెటర్ల జెర్సీలను వేలం వేసి వచ్చిన నిధులను 'రెడ్ ఫర్ రూత్' ఛారిటీ కోసం కేటాయించారు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ జెర్సీ రూ.5.40 లక్షలు, రవీంద్ర జడేజా రూ.4.94 లక్షలు, కేఎల్ రాహుల్ రూ.4.70 లక్షలు, జో రూట్ రూ.4.47 లక్షలు, బెన్ స్టోక్స్ రూ.4 లక్షలు వేలంలో అమ్ముడయ్యాయి. జో రూట్ టోపీకి రూ.3.52 లక్షలు, భారత వికెట్ కీపర్ రిషభ్ పంత్ క్యాప్‌నకు రూ.1.76 లక్షలు వచ్చాయి. ప్రతి సంవత్సరం లార్డ్స్ వేదికగా జరిగే ఒక టెస్టును మాజీ క్రికెటర్ ఆండ్రూ స్ట్రాస్‌కు చెందిన 'రెడ్ ఫర్ రూత్' ఫౌండేషన్‌కు అంకితం చేయడం ఆనవాయితీగా వస్తోంది.





# హ్యాపీ రక్షాబంధన్.. అంటున్న టీమ్‌ఇండియా క్రికెటర్లు

ఇంటర్నెట్ డెస్క్: అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రక్షాబంధన్. ఈ పర్వదినం సందర్భంగా టీమ్‌ఇండియా క్రికెటర్లు సూర్యకుమార్ యాదవ్ శ్రేయస్ అయ్యర్ రింకూ సింగ్ తమ సోదరీమణులతో ఉన్న చిత్రాలను సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. వీటిపై అభిమానులు లైక్‌ల వర్షం కురిపిస్తున్నారు. కామెంట్ల మోత మోగిస్తున్నారు.

టీమ్‌ఇండియా టీ 20 కెప్టెన్ సూర్యకుమార్ ఇటీవలే శస్త్రచికిత్స పూర్తి చేసుకున్నాడు. సెప్టెంబర్‌లో ప్రారంభం కానున్న ఆసియా కప్ కోసం సన్నద్ధమవుతున్నాడు. రాఖీ పౌర్ణమి సందర్భంగా అతడు తన సోదరితో ఉన్న పలు చిత్రాలను సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేశాడు. 'చివరి చిత్రం మన అనుబంధానికి అద్దం పడుతుంది రక్షాబంధన్ శుభాకాంక్షలు' అంటూ ఆ ఫొటోల కింద రాసుకొచ్చాడు.
శ్రేయస్ తన సోదరితో దిగిన చిత్రాన్ని రాఖీ పౌర్ణమి సందర్భంగా.. సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. 'హ్యాపీ రక్షా బంధన్' అని ఆమెకు శుభాకాంక్షలు తెలిపాడు. ఛాంపియన్స్ ట్రోఫీలో శ్రేయస్ అయ్యర్ బ్యాట్‌తో రాణించాడు. 243 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. లీగ్ దశలో న్యూజిలాండ్‌పై 98 బంతుల్లోనే 79 పరుగులు చేశాడు. ఆస్ట్రేలియాతో జరిగిన సెమీఫైనల్లో 45 రన్స్ సాధించాడు. న్యూజిలాండ్‌తో జరిగిన తుదిపోరులోనూ 48 పరుగులు సాధించి, భారత్‌ను విజేతగా నిలపడంలో తనవంతు పాత్ర పోషించాడు.
పవర్ హిట్టర్‌గా పేరున్న రింకూ సింగ్.. తన సోదరి నేహాసింగ్‌కు రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపాడు. రింకూకు రాఖీ కడుతున్న ఫొటోను ఆమె సోషల్‌మీడియాలో అప్‌లోడ్ చేశారు. గత టీ20 వరల్డ్ కప్ నుంచి రింకూసింగ్ పొట్టిఫార్మాట్లో టీమ్‌ఇండియాకు కీలక ఆటగాడిగా మారాడు. ఇప్పటి వరకు టీమ్‌ఇండియా తరఫున 33 టీ20 మ్యాచ్‌లు ఆడిన రింకూ సింగ్ 546 పరుగులు చేశాడు. ఇందులో మూడు హాఫ్ సెంచరీలున్నాయి

# కేఎల్‌ను కనీసం ప్రశంసించలేరా? ఎల్‌ఎస్‌జీపై ఫ్యాన్స్ ఫైర్!




**ఇంటర్నెట్ డెస్క్:** ఇంగ్లాండ్‌తో ఐదు టెస్టుల సిరీస్‌ను టీమ్‌ఇండియా 22తో సమం చేసుకుంది. ఈసందర్భంగా జట్టు ఆటగాళ్లపై సర్వత్రా ప్రశంసల వర్షం కురిసింది. మాజీలు, ప్రస్తుత క్రికెటర్లను అభినందించారు. ఐపీఎల్ ఫ్రాంచైజీలు కూడా సోషల్ మీడియా వేదికగా పోస్టులు పెట్టాయి. ఇప్పుడు ఇదే నెట్టింట కొత్త చర్చకు దారితీసింది. జట్టులోని అందరి ఫొటోలను పెట్టిన లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ కేఎల్ రాహుల్‌ను మాత్రం పక్కన పెట్టడం విమర్శలకు దారితీసింది.

ఇంగ్లాండ్‌పై 500కి పైగా పరుగులు చేసిన కేఎల్ రాహుల్‌ను ఎలా విస్మరిస్తారంటూ కామెంట్లు వచ్చాయి. కొత్త బంతితో ఇంగ్లాండ్ పేసర్లను ఎదుర్కొన్న బ్యాటర్‌కు కనీసం మర్యాద ఇవ్వాలని అనిపించలేదా? అంటూ విమర్శలు వచ్చాయి. పాత పగను మనసులో పెట్టుకొనే ఇలాంటి పోస్టు వేసి ఉంటుందనే వారూ లేకపోలేదు. గత మెగా వేలానికి ముందు ఎల్‌ఎస్‌జీని నడిపించిన కేఎల్ జట్టును వీడిన సంగతి తెలిసిందే. ఐపీఎల్ 2024 సీజన్ సమయంలో కేఎల్‌తో తీవ్రస్థాయిలో ఆ ఫ్రాంచైజీ ఓనర్ సంజీవ్ గోయెంకా సంభాషించిన తీరుతోనే అలాంటి నిర్ణయం తీసుకున్నాడు. ఆ తర్వాత జరిగిన మెగా వేలంలో రిషభ్ పంత్‌ను రూ. 27 కోట్లకు వెచ్చించి మరీ దక్కించుకుంది. ఇప్పుడు సోషల్ మీడియా పోస్టులో కేఎల్ ప్రస్తావన తేకపోవడంపై అభిమానులు ఆగ్రహం వ్యక్తంచేశారు.

"కేఎల్ రాహుల్‌ను కావాలనే పక్కన పెట్టినట్లుంది. ఇలాంటివాటిని చూస్తేనే అసహ్యమేస్తోంది. ఇంగ్లాండ్‌పై 500కి పైగా పరుగులు చేసిన బ్యాటర్‌ను విస్మరిస్తారా?"

"కేఎల్ రాహుల్‌కు మీరు విలువ ఇవ్వకపోయినా నష్టం ఏమీ లేదు. అతడి వ్యాల్యూ ఏమీ తగ్గదు. కానీ, మీ మూర్ఖ మనస్తత్వానికి ఇదే నిదర్శనం. ఫొటో ఆల్బమ్‌లో కూడా పెట్టుకోలేకపోవడం దారుణం"

"రాహుల్ మాత్రమే కాదు యశస్వి జైస్వాల్ ఫొటో కూడా లేదు. ఓపెనర్ల ఆట లేకుండా ఇంగ్లాండ్‌ను అడ్డుకోగలిగారని ఎల్‌ఎస్‌జీ భావిస్తున్నట్లుంది. ఐపీఎల్‌లో ఇలాంటి జట్టును ఎప్పుడూ చూడలేదు"

"అందుకే, ఎల్‌ఎస్‌జీని చెత్త టీమ్ అనేది. వారి మైండ్‌సెట్ ఎప్పుడూ ఇలానే ఉంటుంది. ప్లేయర్లను గౌరవించడం చేతకాదు. ఆట గురించి అవగాహన లేకుండా ఉంటే పరిస్థితి ఇలానే తయారవుతుంది. భారత క్రికెటర్లకైనా గౌరవం ఇవ్వడం నేర్చుకోవాలి"

# సంజు దారెటు?

**దిల్లీ : ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్ జట్టును అయిదు సీజన్ల పాటు సారథిగా నడిపించిన ఆటగాడు సంజు శాంసన్. స్థిరమైన కెప్టెన్ కోసం చూస్తున్న రాయల్‌స్‌కు అతను సరైన ప్రత్యామ్నాయంగా కనిపించాడు. 2021లో, 25 ఏళ్ల వయసులో కెప్టెన్ అయిన శాంసన్.. ఆ జట్టును బాగానే నడిపించాడు. రెండో కప్పు కోసం సుదీర్ఘ కాలంగా సాగుతున్న నిరీక్షణకు తెరదించకపోయినా.. అంతకుముందున్న సారథులతో పోలిస్తే మెరుగైన ఫలితాలే రాబట్టాడు. ఇంకా కొన్నేళ్లు రాయల్స్ కెప్టెన్‌గా కొనసాగుతాడనుకున్న శాంసన్.. అనూహ్యంగా ఆ జట్టును వీడుతుండడం చర్చనీయాంశంగా మారింది.**




తనను విడిచిపెట్టాలని రాజస్థాన్ యాజమాన్యాన్ని సంజు కోరిన నేపథ్యంలో అతను ఆ జట్టుకు దూరమవడం లాంఛనమే. అయితే ఈ ఏడాది ఐపీఎల్ ముందు వరకు రాయల్స్ యాజమాన్యం, కోచింగ్ సిబ్బందితో మంచి సంబంధాలున్న శాంసన్..ఇప్పుడు ఆ జట్టును వీడాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చిందన్నది ప్రశ్నార్థకం. టీమ్‌ఇండియా కోచ్‌గా పదవీ కాలం ముగియడంతో రాజస్థాన్ జట్టుకు తిరిగి శిక్షకుడిగా వచ్చిన ద్రవిడ్‌తో సంజుకు పొసగలేదని తెలుస్తోంది. ఈ సీజన్ ఆరంభంలో గాయంతో ఇబ్బంది పడ్డ సంజు.. కొన్ని మ్యాచ్‌ల్లో ఇంపాక్ట్ ప్లేయర్‌గా బరిలోకి దిగాడు. ఆ సమయంలో అతణ్ని సంప్రదించకుండా జట్టుకు సంబంధించిన నిర్ణయాలు తీసుకోవడంతో సంజు అసహనానికి గురైనట్లు వార్తలు వచ్చాయి. సూపర్ ఓవర్‌కు దారి తీసిన ఓ మ్యాచ్ సందర్భంగా ఆటగాళ్లందరూ ద్రవిడ్‌తో మంతనాలు జరుపుతుంటే.. సంజు తనకేం పట్టనట్లు దూరంగా ఉండడంతో వీరి మధ్య విభేదాలు బయటపడ్డాయి. ఓపెనర్‌గా దిగడమే సంజుకు ఇష్టం కాగా.. ఈ సీజన్లో అతణ్ని మూడో స్థానానికి పంపి, యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీని జైస్వాల్‌కు జోడీగా ఓపెనింగ్‌లో ఆడించడం అతడిని అసంతృప్తికి గురి చేసినట్లు సమాచారం. ఒకప్పటి తరహాలో ఈసారి జట్టులో ఇమడలేకపోయిన సంజు.. ఇది తన టీం కాదన్న భావనకు వచ్చాడని, అందుకే రాయల్స్‌ను వీడాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది.

**తర్వాత ఎక్కడ?**

సంజు రాజస్థాన్‌ను వీడటం దాదాపుగా ఖాయమైన నేపథ్యంలో అతని భవిష్యత్తు ఏంటన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. చెన్నై సూపర్ కింగ్స్, కోల్‌కతా నైట్‌రైడర్స్ ఫ్రాంచైజీలు అతడి కోసం ప్రయత్నించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. "సంజు వ్యవహారంలో మొదట గుర్తొచ్చే జట్టు చెన్నై. అతడిని తీసుకునేందుకు కోల్‌కతా కూడా సిద్ధంగా ఉంటుంది. సంజు కోసం ఈ రెండు జట్లు పోటీపడటం ఖాయం. కోల్‌కతాకు భారత వికెట్ కీపర్ బ్యాటర్ లేడు. అందుకోసమైనా వాళ్లు శాంసన్ కోసం ప్రయత్నిస్తారు. అతడిని కెప్టెన్‌గా తీసుకుంటే తప్పేంటన్నది రెండో అంశం. కోల్‌కతాకు అజింక్య రహానె చక్కగా సారథ్యం వహించాడు. పరుగులు కూడా సాధించాడు. అయితే బ్యాటర్‌గా రహానె ఓపెనింగ్ చేస్తాడా లేదా మరో స్థానంలో ఆడతాడా అన్నది కొద్దిగా సమస్యే. కోల్‌కతా వదులుకోగలిగిన మరో ఆటగాడు వెంకటేశ్ అయ్యర్. అదే జరిగితే రూ.24 కోట్లు కోల్‌కతాకు అందుబాటులోకి వస్తాయి. ఆ మొత్తంతో వేలంలో చాలా ప్రభావం చూపొచ్చు. ధోని స్థానాన్ని భర్తీ చేయడం కోసం సంజు వైపు చెన్నై చూడొచ్చు. అతడి కోసం రవిచంద్రన్ అశ్విన్‌ను రాజస్థాన్‌కు బదిలీ చేసే అవకాశం లేకపోలేదు. ప్రస్తుతం రాజస్థాన్‌కు స్పిన్నర్ అవసరం ఉంది. గతంలో రాజస్థాన్‌కు ఆడిన అశ్విన్ ఆ లోటును భర్తీ చేయగలడు. కాబట్టి ఈ ప్రతిపాదనను కొట్టిపారేయలేం" అని భారత మాజీ ఆటగాడు ఆకాశ్ చోప్రా విశ్లేషించాడు.